మా కలం.. మీ గళం..
RNI : APTEL/ 2017/74310
# మన గళం
దిన పత్రిక
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ | పబ్లిషర్ : నగరూరు రాఘవేంద్ర | సంపుటి : 08 | సంచిక : 198 | బుధవారం | 21 - 01 - 2026 | పేజీలు: 8 | వెల: 4

## వీధి కుక్కల అంశంలో వెనక్కి తగ్గను: రేణూ దేశాయ్



2 లో..



### బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా
## నితిన్ నబీన్ ఎన్నిక

- ప్రధాని మోదీ సమక్షంలో బాధ్యతల స్వీకరణ
- అభినందనలు, శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని
- పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా నాయకత్వం

మన గళం, న్యూఢిల్లీ : భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమక్షంలో నితిన్ నబీన్ బాధ్యతలు స్వీకరించారు. ఈ శుభసందర్భంలో ప్రధాని నరేంద్ర మోదీ నితిన్ నబీన్‌ను హృదయపూర్వకంగా అభినందిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీకి ఆయన నాయకత్వం కొత్త ఉత్సాహం, దిశానిర్దేశం ఇస్తుందని ప్రధాని విశ్వాసం వ్యక్తం చేశారు. నితిన్

2 లో..

### మణిపూర్‌లో సంయుక్త
## భద్రతా ఆపరేషన్లు



- 14 మంది అరెస్ట్, ఆయుధాల స్వాధీనం
- కొండ, మైదాన జిల్లాల్లో భద్రతా బలగాల సమన్వయం
- ఆయుధాలు, పేలుడు పదార్థాల స్వాధీనం

మన గళం, ఇంఫాల్ : మణిపూర్ రాష్ట్రంలో అంతర్గత భద్రతను బలోపేతం చేసే దిశగా భారత సైన్యం, అస్సాం రైఫిల్స్ దళాలు స్పియర్ కార్ప్స్ ఆధ్వర్యంలో, మణిపూర్ పోలీస్ తో కలిసి ఇంటెలిజెన్స్ ఆధారిత సంయుక్త ఆపరేషన్లు నిర్వహించాయి. ఈ ఆపరేషన్లు జనవరి 10 నుంచి 17 వరకు కొనసాగాయి. రాష్ట్రంలోని కొండ, మైదాన ప్రాంతాలైన

2 లో..

### సినిమా టికెట్ ధరల పెంపుపై
## తెలంగాణ హైకోర్టు సంచలన ఆదేశాలు

- టికెట్ ధరల పెంపు ఉత్తర్వులు 90 రోజుల ముందే ఇవ్వాలి
- కోర్టు సెలవుల్లో జీఓ జారీపై అభ్యంతరం
- పిటిషన్‌పై కీలక వ్యాఖ్యలు




మన గళం, హైదరాబాద్ : సినిమా టికెట్ ధరల పెంపుకు సంబంధించి తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇకపై సినిమా టికెట్ ధరల పెంపుకు సంబంధించిన ఉత్తర్వులు కనీసం 90 రోజుల ముందే ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు జారీ చేసే జీఓలు ముందస్తు ప్రణాళికతో, పారదర్శకంగా ఉండాలని కోర్టు స్పష్టం చేసింది. కోర్టు సెలవు రోజుల్లో విష్ణు మంచు (మన శంకర వరప్రసాద్) సినిమా టికెట్ ధరలు పెంచుతూ ప్రభుత్వం జీఓ జారీ చేసిందని పేర్కొంటూ ఓ న్యాయవాది దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా సెలవుల సమయంలో తీసుకున్న నిర్ణయాలపై కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. టికెట్

2 లో..


## చంద్రబాబు ఎక్కడికి వెళ్లినా జగన్ నామస్మరణే



- పాలనపై దృష్టి లేక డైవర్షన్ రాజకీయాలు
- ల్యాండ్, మైనింగ్, లిక్కర్ మాఫియాలపై ఆరోపణలు
- శాంతిభద్రతల విషయంలో ప్రభుత్వం విఫలం
- వైసీపీ నేత కొరముట్ల శ్రీనివాసులు

అమరావతి, జనవరి 20 ,మన గళం,: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎక్కడికి వెళ్లినా మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నామస్మరణే చేస్తున్నారని వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు తీవ్ర విమర్శలు చేశారు. దావోస్‌కు వెళ్లినా జగన్ పేరు చెప్పడమే చంద్రబాబుకు అలవాటైందని ఎద్దేవా చేశారు. పాలనపై దృష్టి పెట్టకుండా ప్రతిపక్ష నేత పేరు

2 లో..



# పోలవరంలో అంతర్జాతీయ నిపుణుల పరిశీలన

- నిర్మాణ పురోగతి, భద్రత, నాణ్యతపై సమీక్ష
- గ్లోబల్ ప్రమాణాలకు అనుగుణంగా పనులు
- రాష్ట్ర జలవిద్యుత్ భద్రతకు కీలక అడుగు

మన గళం, పోలవరం : ఆంధ్రప్రదేశ్ జీవనాడిగా భావిస్తున్న పోలవరం ప్రాజెక్ట్ వద్ద ప్రపంచ స్థాయి ఇంజినీరింగ్ నిపుణులు సమగ్ర పరిశీలన నిర్వహించారు. ప్రాజెక్ట్‌లో జరుగుతున్న నిర్మాణ పనుల పురోగతి, భద్రతా ప్రమాణాలు, నాణ్యత అంశాలను వారు క్షుణ్ణంగా సమీక్షించారు. డ్యామ్ నిర్మాణం, సహాయక నిర్మాణాలు, వరద నియంత్రణ వ్యవస్థలు, భద్రతా ఏర్పాట్లు వంటి అంశాలపై అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా పనులు జరుగుతున్నాయా అనే కోణంలో నిపుణులు పరిశీలించారు. అవసరమైన చోట సాంకేతిక సూచనలు, మెరుగుదలలపై మార్గదర్శకాలు అందించినట్లు అధికారులు తెలిపారు. పోలవరం ప్రాజెక్ట్ పూర్తయ్యే దశకు చేరుకుంటే రాష్ట్రానికి సాగునీరు, విద్యుత్ ఉత్పత్తి, తాగునీటి భద్రత మరింత బలపడుతుందని నిపుణులు అభిప్రాయపడ్డారు. వ్యవసాయ విస్తరణ, పారిశ్రామిక అభివృద్ధికి ఈ ప్రాజెక్ట్ కీలకంగా మారనుందని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి మైలురాయిగా నిలిచే పోలవరం ప్రాజెక్ట్‌ను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని అధికారులు తెలిపారు. ఈ అంతర్జాతీయ పరిశీలన రాష్ట్రానికి జల భద్రత, శక్తి భద్రత, ఆర్థిక వృద్ధి దిశగా మరో కీలక అడుగుగా భావిస్తున్నారు.

## జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1 వరకు విశాఖ ఉత్సవ్

- విశాఖ కలెక్టరేట్‌లో ఉన్నతస్థాయి సమీక్ష
- మూడు జిల్లాల్లో ఒకేసారి ఉత్సవాల నిర్వహణ
- పర్యాటకానికి కొత్త ఊపు ఇవ్వడమే లక్ష్యం



విశాఖపట్నం, జనవరి 20, మన గళం,: విశాఖపట్నం కలెక్టరేట్‌లో విశాఖ ఉత్సవ్ నిర్వహణపై జరిగిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో సహచర మంత్రులు, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో విశాఖ ఉత్సవ్‌ను జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1 వరకు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు.

2 లో..

## ఉగాది నుంచే '50 శాతం గ్రీన్ కవర్' అమలు: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

- పండుగలోపు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశాలు
- 2047 నాటికి రాష్ట్రంలో 50% పచ్చదనం లక్ష్యం
- అన్ని శాఖల సమిష్టి బాధ్యతతో ముందుకు

2 లో..

అమరావతి, జనవరి 20 మన గళం,: రాష్ట్రంలో 50 శాతం పచ్చదనం పెంపే లక్ష్యంగా చేపట్టిన 'గ్రీన్





# బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ ఎన్నిక



నబీన్ ఎన్నికతో పార్టీ సంస్థాగత బలోపేతం మరింత వేగం పొందుతుందని బీజేపీ వర్గాలు అభిప్రాయపడ్డాయి. కార్యకర్తలతో సన్నిహిత సంబంధాలు, చురుకైన నాయకత్వంతో పార్టీని ముందుకు నడిపిస్తారని పేర్కొన్నారు. బీజేపీ సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లే దిశగా నితిన్ నబీన్ నాయకత్వంలో పార్టీ కొత్త లక్ష్యాలతో ముందుకు సాగుతుందని ఈ సందర్భంగా నాయకులు స్పష్టం చేశారు.

# ఉగాది నుంచే '50 శాతం గ్రీన్ కవర్' అమలు: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

కవర్' ప్రాజెక్టును ఉగాది నుంచి అమలు చేయాలని ఉప ముఖ్యమంత్రి, అటవీపర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి స్థాయి కార్యాచరణ ప్రణాళికలను పండుగలోపు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ఈ బృహత్ కార్యక్రమంలో అన్ని ప్రభుత్వ శాఖలూ త్రికరణ శుద్ధిగా భాగస్వాములవ్వాలని తెలిపారు. మంగళవారం సచివాలయంలో '50% గ్రీన్ కవర్' ప్రాజెక్టుపై అటవీ, పర్యావరణ శాఖలతో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులతో పవన్ కల్యాణ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. 2047 నాటికి రాష్ట్ర భూభాగంలో 50 శాతం పచ్చదనం సాధించడమే లక్ష్యమని వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 30 శాతం పచ్చదనం ఉందని, వచ్చే నాలుగేళ్లలో దీనిని 37 శాతానికి పెంచాల్సిన అవసరం ఉందని పవన్ వివరించారు. ఇందుకోసం దాదాపు 9 లక్షల హెక్టార్లలో మొక్కలు నాటాల్సి ఉంటుందని తెలిపారు. ఈ యజ్ఞంలో అన్ని శాఖలు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాల్సిందేనని సూచించారు. పరిశ్రమల శాఖ కాలుష్యాన్ని తగ్గించే మొక్కలను నాటాలని, తీర ప్రాంతాల్లో ఉప్పునీటిని, పెనుగాలులను తట్టుకునే స్థానిక జాతుల మొక్కలకు ప్రాధాన్యత ఇవ్వాలని పవన్ ఆదేశించారు. 'గ్రేట్ గ్రీన్ వాల్' ప్రాజెక్టును కూడా సమర్థంగా ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. రైతుల భూముల్లో దీర్ఘకాలిక ప్రయోజనాలు ఇచ్చే పండ్ల మొక్కలు, కాలువ గట్ల వెంబడి మొక్కలు నాటేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఈ ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, బడ్జెట్ కేటాయింపులపై ఆయనతో చర్చిస్తానని పవన్ కల్యాణ్ తెలిపారు. ఫిబ్రవరి 5న జరిగే తదుపరి సమావేశానికి అన్ని శాఖలు పూర్తిస్థాయి కార్యాచరణ ప్రణాళికలతో హాజరుకావాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పలువురు ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, శాఖాధిపతులు పాల్గొన్నారు.

# మణిపూర్‌లో సంయుక్త భద్రతా ఆపరేషన్లు



థౌబాల్, బిష్ణుపూర్, ఇంఫాల్ ఈస్ట్, ఇంఫాల్ వెస్ట్ జిల్లాల్లో ఈ ప్రత్యేక చర్యలు చేపట్టారు. భద్రతా బలగాల సమన్వయంతో సాగిన ఆపరేషన్లలో చురుకైన కౌంటర్ ఇన్సర్జెన్సీ చర్యలు అమలు చేశారు. ఈ సంయుక్త ఆపరేషన్ల ఫలితంగా మొత్తం 14 మంది కేడర్లను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. అలాగే 8 ఆయుధాలు, పేలుడు పదార్థాలు, అక్రమంగా నిల్వ చేసిన యుద్ధ సామగ్రి సహా ఇతర నిషేధిత వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ విజయవంతమైన చర్యలతో ఈశాన్య భారత ప్రాంతంలో శాంతి, భద్రత మరింత బలోపేతం అవుతుందని భద్రతా వర్గాలు పేర్కొన్నాయి. అంతర్గత భద్రతకు విఘాతం కలిగించే శక్తులపై ఇలాంటి ఇంటెలిజెన్స్ ఆధారిత ఆపరేషన్లు కొనసాగుతాయని స్పష్టం చేశాయి.

# చంద్రబాబు ఎక్కడికివెళ్లినా జగన్ నామస్మరణే

చెప్పడమే ప్రభుత్వ పనిగా మారిందని మండిపడ్డారు. చంద్రబాబు ప్రభుత్వంలో ల్యాండ్ మాఫియా, మైనింగ్ మాఫియా విపరీతంగా పెరిగిపోయాయని కొరముట్ల ఆరోపించారు. సంక్రాంతి పండుగ సమయంలో లిక్కర్ మాఫియా రెచ్చిపోయిందని, ప్రభుత్వం క్వార్టర్‌పై పది రూపాయలు పెంచితే మాఫియా మరో అరవై రూపాయలు పెంచి ప్రజలను దోచుకుందని విమర్శించారు. ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి మద్యం అమ్మకాలు సాగుతున్నాయన్నారు. మందా సాల్మన్ హత్య ఘటనతో దేశమంతా ఉలిక్కిపడినా ప్రభుత్వం స్పందించలేదని ఆరోపించారు. జగన్‌కు ఓటేశారనే కారణంతో పిన్నెల్లి గ్రామంలో 1,500 కుటుంబాలను బహిష్కరించడం దుర్మార్గమని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి, హోంమంత్రి శాంతిభద్రతల విషయంలో పూర్తిగా విఫలమయ్యారని చెప్పారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడిగా సరఫరా అవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కొరముట్ల శ్రీనివాసులు ఆరోపించారు. చంద్రబాబు తన బినామీలకు వేల కోట్ల విలువైన భూములను దోచి పెడుతున్నారని, ప్రజా సమస్యలను పక్కనపెట్టి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు.

# జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1 వరకు విశాఖ ఉత్సవ్

విశాఖపట్నంతో పాటు అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోనూ ఒకేసారి ఉత్సవాలు నిర్వహించేలా సమగ్ర ప్రణాళిక రూపొందించారు. విశాఖలో ఉత్సవాల ప్రారంభ వేడుకలు, అనకాపల్లి జిల్లాలో ముగింపు వేడుకలు నిర్వహించాలని కూడా ఈ సమావేశంలో నిర్ణయించారు. విశాఖ ఉత్సవ్ ద్వారా రాష్ట్ర పర్యాటకానికి కొత్త ఊపునివ్వడంతో పాటు, స్థానిక కళలు, సంస్కృతి, సంప్రదాయాలను దేశవ్యాప్తంగా చాటిచెప్పేలా కార్యక్రమాలను ప్రణాళికబద్ధంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. సంప్రదాయ నృత్యాలు, జానపద కళలు, హస్తకళల ప్రదర్శనలు, ఆహార ఉత్సవాలు వంటి కార్యక్రమాలు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని పేర్కొన్నారు. మూడు జిల్లాల



ప్రజల భాగస్వామ్యంతో విశాఖ ఉత్సవ్‌ను విజయవంతంగా నిర్వహించి, విశాఖను అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## సినిమా టికెట్ ధరల పెంపుపై తెలంగాణ హైకోర్టు సంచలన ఆదేశాలు

ధరల పెంపు వల్ల సామాన్య ప్రేక్షకులపై భారం పడుతుందని, అలాంటి నిర్ణయాలు తొందరపాటు గా కాకుండా ముందస్తు నోటీసులతో తీసుకోవాల్సిన అవసరం ఉందని కోర్టు వ్యాఖ్యానించింది. ప్రజా ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోకుండా తీసుకునే నిర్ణయాలను అనుమతించబోమని స్పష్టం చేసింది. ఇకపై సినిమా టికెట్ ధరల పెంపు అంశంలో ప్రభుత్వం స్పష్టమైన విధానంతో ముందుకు వెళ్లాలని, నిబంధనలకు లోబడి నిర్ణయాలు తీసుకోవాలని తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పు సినిమా పరిశ్రమతో పాటు ప్రేక్షకుల్లోనూ ప్రాధాన్యత సంతరించుకుంది.

# వీధి కుక్కల అంశంలో వెనక్కి తగ్గను: రేణూ దేశాయ్

- విమర్శలు వచ్చినా పోరాటం కొనసాగుతుందని స్పష్టం
- కాశీ నుంచి భావోద్వేగ సందేశం
- రాజకీయాల్లో చేరే ఉద్దేశం లేదని ఖండన

హైదరాబాద్, జనవరి 20 మన గళం,: వీధి కుక్కలను చంపే చర్యలపై గళమెత్తిన నటి రేణూ దేశాయ్ మరోసారి భావోద్వేగంగా స్పందించారు. ఈ అంశంపై తాను చేసిన వ్యాఖ్యలకు తీవ్ర విమర్శలు ఎదురవుతున్నాయని, అయినా వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని ఆమె స్పష్టం చేశారు. తన పోరాటం వీధి కుక్కల హక్కుల కోసమేనని, సమాజం ఈ విషయాన్ని అర్థం చేసుకునే వరకు తాను నిలబడుతానని చెప్పారు.

కాశీలో గంగానదిలో బోటింగ్ చేస్తున్న వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసిన రేణూ దేశాయ్, తనను కాపాడటానికి అమ్మానాన్న, అన్నయ్య, భర్త ఎవరూ లేరంటూ భావోద్వేగంగా పేర్కొన్నారు. తప్పు చేయకపోయినా అనేక మంది విమర్శిస్తున్నారని, వాటికి తిరిగి సమాధానం చెప్పాలనే ఉద్దేశం లేదని తెలిపారు. తాను నమ్మే భగవంతుడికే తన బాధ చెప్పుకుంటానని, ఆయన తన ప్రార్థనలు వింటాడన్న విశ్వాసం ఉందని రాసుకొచ్చారు.వీధి కుక్కల విషయంలో తన పోరాటం కొనసాగుతుందని ఆమె మరోసారి స్పష్టం చేశారు. కొన్ని కుక్కల తప్పుల కారణంగా వందల సంఖ్యలో వాటిని చంపడం సరైన నిర్ణయం కాదని అన్నారు. ఈ అంశాన్ని మానవీయ దృక్పథంతో చూడాలని, సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

తాను రాజకీయ పార్టీలో చేరనున్నట్లు వచ్చిన వార్తలను రేణూ దేశాయ్ ఖండించారు. తనకు అలాంటి ఉద్దేశం ఏమాత్రం లేదని స్పష్టతనిస్తూ, ఇది పూర్తిగా జంతు హక్కుల కోసం చేస్తున్న పోరాటమేనని తెలిపారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా, మూగజీవాల హక్కుల పరిరక్షణ కోసమే తాను ఈ అంశంపై మాట్లాడుతున్నానని ఆమె తేల్చిచెప్పారు.



మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

## మద్దతు ధరతో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన కోడుమూరు ఎమ్మెల్యే





మన గళం కోడుమూరు: కోడుమూరు మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో మద్దతు ధరతో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడానికి ముఖ్యఅతిథిగా కోడుమూరు శాసనసభ్యులు బొగ్గుల దస్తగిరి విచ్చేసి ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యమని రైతుల్ని అన్ని విధాలుగా ఆదుకోవడానికి మా ప్రభుత్వం ఎల్లప్పుడు ముందుంటుందని వారు తెలియజేశారు మద్దతు ధరతో క్వింటాలకి 8000 చొప్పున ప్రభుత్వము రైతుల దగ్గర నుంచి కందులు కొనుగోలు చేస్తుందన్నారు ప్రతి రైతు పంట నమోదు ఉన్నవారిది మాత్రమే కందులు కొనుగోలు చేస్తామని ఈ సందర్భంగా వారు తెలియజేశారు అలాగే ఎకరానికి 5.77 కేజీలు అనగా 5 క్వింటాల 77 కేజీలు చొప్పున రైతులు పండించిన పంటను అమ్ముకోవడానికి అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు గ్రామాలలోనే ప్రభుత్వమే రైతుల ఇళ్ల దగ్గర కందులు కొనుగోలు చేస్తామని దీనికి కావాల్సిన గోనపట్ట సంచులు కూడా రైతులకి ప్రభుత్వం నుంచి ఇస్తామన్నారు. రైతులు తమ పండించిన పంటను తేమశాతం 12 కన్నా ఎక్కువ ఉండకుంటే ఆరబెట్టుకొని సరుకును పట్టించాలి ఈ సూచనలను రైతులు అందరూ ఖచ్చితంగా పాటించాలని వారు తెలియజేశారు రైతులు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకుని రైతు సేవ కేంద్రంలో డిసిఎంఎస్ కోడుమూరు మండల ఉద్యోగి నాగేశ్వర్ రెడ్డి ద్వారా పంటను కొనుగోలు చేస్తామన్నారు ఈ కార్యక్రమంలో కేడిసీఎం చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్ మరియు జిల్లా గొర్రెల సంఘం అధ్యక్షులు శ్రీనివాసులు మరియు కర్నూలు ఏడి సాల్ రెడ్డి మరియు డీసీఎంఎస్ మేనేజర్ రవిబాబు మరియు టిడిపి కోడుమూరు మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి మరియు పట్టణ అధ్యక్షులు గంగాధర్ నాయుడు మరియు వివిధ గ్రామాల నుంచి వచ్చిన టిడిపి నాయకులు, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు ప్రజలు పాల్గొన్నారు.



## ఏకీకృత కుటుంబ సర్వేను పర్యవేక్షించిన ఎంపీడీవో





మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణంలో స్థానిక బుడగ జంగాల కాలనీలోనూ ఏకీకృత కుటుంబ సర్వే జరుగుతున్న విధానంపై కోడుమూరు గ్రామ పంచాయతీ పరిధిలోని మరియు కృష్ణా పురం గ్రామ పంచాయతీ పరిధిలోను కోడుమూరు ఎంపీడీవో ఏసీ రాముడు సందర్శించి సర్వే చేస్తున్నటువంటి విధానంపై పదవేక్షించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయం సిబ్బంది అందరూ కూడా ఏకీకృత కుటుంబ సర్వేను ఈనెల 31 వ తారీకు నాటికి మీ మీ క్లస్టర్ లో ఉన్నటువంటి హౌస్ అన్నిటిని కూడా సర్వే కంప్లీట్ చేయ వలసిందిగా ఆదేశించారు కోడుమూరు మండలంలోని ప్రజలందరూ కూడా ఏకీకృత కుటుంబ సర్వేలో పాల్గొని మీయొక్క సమాచారాన్నిమీ ఇంటి దగ్గరికి వచ్చినటువంటి సచివాలయం సిబ్బందితో ఇచ్చి ఏకీకృత కుటుంబ సర్వే యొక్క కార్డును పొంద వలసిందిగా కోరుతూ ప్రభుత్వము ఇచ్చేటువంటి ప్రతి ఒక్క సంక్షేమ పథకాన్ని పొందుటకు ఏకీకృత కుటుంబ సర్వే ఉపయోగ పడుతుందని ఈ సందర్భంగా వారు తెలియజేశారు ప్రజలందరూ ఈ సౌకర్యాన్ని ఉపయోగించ వలసిందిగా ప్రజానీకాన్ని వారు కోరుకున్నారు అదే విధంగా మండలంలో కోడుమూరు సచి వాలయం సందర్శించి సిబ్బంది ఎల్లప్పుడూ సచివాల యంలో ఒక్కరైనా అందు బాటులో కచ్చితంగా ఉండవలెనని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు మరియు గృహ నిర్మాణ శాఖకు సంబంధించి నటువంటి అంశంలో ఎంపీడీవో లాగిన్ లో ఉన్నటువంటి 43 హౌసెస్ ను వెరిఫై చేశారు.

# వైసీపీ నేతలకు బీసీలంటే గిట్టదు...

**– అధికారం కోల్పోయామని జీర్ణించుకోలేక అలజడులు సృష్టిస్తున్నారు వైసిపి ప్రభుత్వం...**



నందవరం జనవరి 20,మనగళం న్యూస్ : నందవరం మండల పరిధిలోని సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ చిన్న రాముడు మరియు బ్యాంకు చైర్మన్ గోపాల్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగను రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలందరూ ఆనందోత్సహాల మధ్య జరుపుకుంటుంటే వైసీపీ నేతలు మాత్రం ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టి ప్రజలను భయభ్రాంతుల్ని చేసేందుకు హత్యా రాజకీయాలకు పాల్పడ్డారు. తుని నియోజకవర్గం కోటనందూరు మండలం అల్లిపూడి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, బీసీ నేత లాలం బంగారయ్యను వైసీపీ నేతలు అతి కిరాతకంగా హతమార్చారు అధికారం కోల్పోయామని జీర్ణించుకోలేక అలజడులు సృష్టించే కుట్ర రప్పా రప్పా అంటూ పిలుపునిచ్చి, దాడులకు ప్రోత్సాహం బడుగు, బలహీన వర్గాలపై వైసీపీ నేతలు దమనకాండకు పాల్పడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాము. తెలియజేశారు. వైసీపీ నేతలకు బీసీలంటే గిట్టదు, అంచలంచెలుగా ఎదిగి గుర్తింపు తెచ్చుకుంటున్న బీసీ నేతలను అణచివేయడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైసీపీ నేతలపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకుంటోంది తప్పు చేసిన వారిని ఎవరినీ వదలిపెట్టేదిలేదు వైసీపీ హయాంలో జగన్ అండతో వైసీపీ నేతలు బీసీలపై దమనకాండకు పాల్పడ్డారు.. ఇప్పుడు కూడా అదే ధోరణితో వ్యవహరిస్తున్నారు వైసీపీ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రాజ్యాంగం ఇచ్చిన 34 శాతం రిజర్వేషన్లలో కోత పెట్టడం వల్ల 16,800 బీసీ ప్రతినిధులు రాజ్యాంగబద్ధమైన పదవులకు దూరమయ్యారు. బీసీ సబ్ ప్లాన్ నిధులు రూ. లక్ష కోట్లు దారిమళ్లించారు, ఆదరణ రద్దు చేశారు బీసీల రాజకీయ ప్రాతినిధ్యాన్ని దెబ్బతీసి ఇప్పుడు బీసీలపై వేధింపులకు పాల్పడుతున్నారు జగన్ రెడ్డి పాలనలో బీసీలకు జరిగింది అడుగడుగునా అవమానమే జగన్ రెడ్డి సొంత జిల్లా ప్రొద్దుటూరులో చేనేత వర్గానికి చెందిన నందం సుబ్బయ్యను రోడ్డు మీదే అత్యంత కిరాతకంగా హత్య చేశారు. అమర్ నాథ్ గౌడ్ ను నడిరోడ్డుపై పెట్రోల్ పోసి నిప్పంటించి చంపారు పల్నాడులో జల్లయ్య యాదవ్, తోట చంద్రయ్య లాంటి వందలాదిమంది బీసీలను హత్య చేశారు. పల్నాడులో జల్లయ్య యాదవ్, తోట చంద్రయ్య లాంటి వందలాదిమంది బీసీలను హత్య చేశారు. ఎన్ సీఆర్ బీ రిపోర్టు ప్రకారం 188 మంది ఎస్సీలు హత్యగావింపబడ్డారు పుంగనూరులో బీసీ వర్గానికి చెందిన రామచంద్ర యాదవ్ ఇంటిపై నాటిమంత్రి పెద్దిరెడ్డి ముఠానే స్వయంగా దాడి చేసి, ఇంటిని ధ్వంసం చేసింది ప్రకాశం జిల్లాలో పద్మ అనే బీసీ మహిళ వైసీపీలో చేరను అన్నందుకు వీధుల్లోకి నగ్నంగా లాగి అవమానంతో ఆత్మహత్యకు దారితీసిన ఘటన ఈ రాష్ట్ర చరిత్రలో చీకటి పేజీ అయ్యన్న పాత్రుడు సబ్బం హరి పల్లా శ్రీనివాస్ వంటి నేతల ఇళ్లు, భవనాలు కూల్చేశారు. బీసీల తోటలను నరికేశారు ఎందుకు బీసీ నాయకత్వం వైసీపీకి భయం అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్రపై అక్రమ కేసులు పెట్టి వేధించారు. పెళ్లికి వెళ్లాడని యనమల రామకృష్ణుడుపై అట్రాసిటీ కేసు. బీసీ మహిళా నేతలను కూడా విడిచిపెట్టలేదు. ఆదిరెడ్డి భవానీ, గౌతు శిరీష, పంచుమర్తి అనురాధ వంటి నేతలపై జగనన్ సోషల్ మీడియా మూక వ్యక్తిత్వ హననానికి తెగబడింది. కానీ ఒక్కరిపై కూడా చర్య లేదు ఎందుకంటే బాధితులు బీసీలు, ఒక వర్గాన్ని దెబ్బతీయడానికి వైసీపీ ప్రయత్నించిన విధానం స్పష్టంగా చూడాలి. బీసీ వర్గాన్ని రాజకీయంగా కొట్టి, సామాజికంగా అవమానించి, ఆర్థికంగా దోచుకుని, భౌతికంగా టార్గెట్ చేసి, వ్యవస్థతంగా అణగదొక్కారు. బీసీలకు దక్కాల్సిన రూ.75,760 కోట్ల సబ్ ప్లాన్ నిధులను దారిమళ్ళించి, 8,000 ఎకరాల అసైన్డ్ భూములను లాక్కొని ఉపాధిని దెబ్బతీసారు విద్య, నైపుణ్యం, పారిశ్రామిక రాయితీలు, ఆదరణ వంటి పథకాలు రద్దు చేసి.. వివిధ వృత్తులు చేసుకునే బీసీ కుటుంబాల పొట్ట కొట్టి వారి భవిష్యత్తును అంధకారమయం చేశారు ఈ కార్యక్రమంలో పేట సర్పంచ్ ఉదయ్ కుమార్ గౌడ్ పూలచింత గడ్డంబజారి పేట గ్రామ అధ్యక్షుడు కామెల్ సొసైటీ బ్యాంక్ డైరెక్టర్ భీమన్న నాగులదిన్నె తిమ్మప్ప నందవరం వడ్డీ గోపాల్ మరియు వివిధ గ్రామాల బీసీలు నాయకులు పాల్గొన్నారు.

## ఎక్కువ క్రెడిట్ కార్డులు వాడితే

**– అప్పుల ఊబిలోకి జారిపోతారు.. ఈ 3 తప్పులు చేస్తే ప్రమాదమే..!**




హైదరాబాద్ 20 జనవరి 2026 : మనగళం: ఆఫర్లు, రాయితీలు, అవసరాల పేరుతో చాలామంది ఒకటి కంటే ఎక్కువ క్రెడిట్ కార్డులను వాడుతున్నారు. బ్యాంకులు తరచూ ఫోన్ చేసి కార్డులు తీసుకోమని ఒత్తిడి చేయడం, ఆన్‌లైన్ కొనుగోళ్లలో ఆకర్షణీయమైన తగ్గింపులు కనిపించడం వల్ల చాలా మంది ఆలోచించకుండా కార్డులు తీసుకుంటున్నారు. కానీ సరైన అవగాహన లేకుండా ఎక్కువ కార్డులు వాడటం అప్పుల పాలయ్యే ప్రమాదాన్ని పెంచుతుందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. మొదటి పెద్ద తప్పు సమయానికి బిల్లులు చెల్లించకపోవడం. ఒకటి కంటే ఎక్కువ కార్డులు ఉన్నప్పుడు ప్రతి కార్డుకు వేర్వేరు బిల్లు తేదీలు, చెల్లింపు గడువులు ఉంటాయి. ఏదైనా ఒక్క బిల్లు ఆలస్యం అయితే అదనపు జరిమానాలు, అధిక వడ్డీ భారం పడుతుంది. దీని వల్ల ఆర్థిక ఒత్తిడి పెరిగి అప్పుల చక్రంలో చిక్కుకునే అవకాశం ఉంటుంది. రెండవ తప్పు అవసరానికి మించి ఖర్చు చేయడం. చేతిలో ఒక్క కార్డు కాకుండా చాలా కార్డులు ఉంటే ఖర్చు చేస్తున్నామన్న భావన తగ్గిపోతుంది. చిన్న చిన్న కొనుగోళ్లు కలిపి పెద్ద మొత్తం అవుతుంది. నెలాఖరుకు బిల్లులు చూసినప్పుడు షాక్ తగలడం సహజం. ఇలా నియంత్రణ లేకుండా ఖర్చు చేస్తే తిరిగి చెల్లించలేని పరిస్థితి వస్తుంది. మూడవ తప్పు తరచూ కొత్త కార్డులకు దరఖాస్తు చేయడం లేదా ఒకేసారి అనేక కార్డులను రద్దు చేయడం. ఇలా చేయడం వల్ల క్రెడిట్ స్కోర్ దెబ్బతింటుంది. స్కోర్ తగ్గితే భవిష్యత్తులో రుణాలు తీసుకోవడం కష్టమవుతుంది. ఒకేసారి అన్ని కార్డులు మూసివేయడం కూడా మంచిది కాదని నిపుణులు సూచిస్తున్నారు. అవసరం లేని కార్డులను నెమ్మదిగా ఒక్కొక్కటిగా మూసివేయడం ఉత్తమ మార్గం. అయితే క్రమశిక్షణతో వాడితే ఒకటి లేదా రెండు కార్డులు ఉపయోగకరంగానే ఉంటాయి. ప్రతి నెల బిల్లులను సమయానికి చెల్లించడం, ఖర్చుకు పరిమితి పెట్టుకోవడం, అవసరం లేని కొనుగోళ్లకు దూరంగా ఉండడం వల్ల కార్డులు సహాయకారిగా మారుతాయి. కానీ నిర్లక్ష్యం చేస్తే అవే అప్పుల బారంగా మారతాయని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## పాడైపోయిన కులాయి పైపులను గ్రామ పంచాయతీ పట్టించుకోవాలి : సిపిఎం



మన గళం కోడుమూరు: కోడుమూరు గ్రామంలో బేపారం వీధిలో బాబన్న శంకరప్ప ఇంటి వద్ద నీటి కొళాయి పైపులైను ఇనుప పైపులు తుప్పు పట్టి నీరు వృధాగా పోతు డ్రైనేజీ పక్కనే పైప్లైన్ ఉన్నందువల్ల కలుషితమైన నీళ్లు రావడానికి అవకాశం ఉంది కనుక ఇప్పటికే నెల నుంచి ఇదే పరిస్థితి ఉన్నదని డ్యామేజ్ కావడంతో కొళాయి ఆ వీధిలో ఇళ్లకు కూడా సరిగా నీళ్లు రావడం లేదని వాళ్లు చెబుతున్నారు గ్రామపంచాయతీ అధికారులు దృష్టి సారించి ఈ సమస్యను పరిష్కరించాలని ఆ వీధిలో వారు కోరుకుంటున్నారు ఇప్పటికైనా గ్రామపంచాయతీ స్పందించాలని స్థానిక ఏ ఐ టి యు సి మండల కార్యదర్శి జిపి వీరన్న మరియు సిపిఎం పార్టీ శేఖర్ డిమాండ్ చేశారు

# లింగాలగట్టు గ్రామం లోని ఫిష్ కంపెనీ ఓనర్ లకు కౌన్సిలింగ్

మనగలం : ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించినచో మీ పైన చట్టపరమైన చర్యలు సున్నిపెంట సి. ఐ. గంట సుబ్బారావు నంద్యాల ఎస్. పి. ఆదేశాల మేరకు ఆత్మకూర్ డి.ఎస్.పి ఆధ్వర్యంలో శ్రీశైలం 2 టౌన్ సి ఐ గంట సుబ్బా రావు "లింగాలగట్టు గ్రామంలోని ఫిష్ కంపెనీ ఓనర్‌లకు మరియు చేపలు వండే వారికి మరియు లింగాలగట్టు ప్రజలకు" లింగాలగట్టు లో జరిగే ట్రాఫిక్ సమస్య గురించి సుండిపెంట స్టేషన్ కు పిలిచి ట్రాఫిక్ రూల్స్ తెలియచేసి మీరు ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించినచో మీ పైన చట్టపరమైన చర్యలు తీసుకుంటాము అని పదే పదే ట్రాఫిక్ అంతరాయం కలిగించినచో, మీ పైన కేసులు కూడ పెట్టీ చర్యలు తీసుకుంటాము అని కౌన్సిలింగ్ చేయడం జరిగింది.



# ఆదోని జిల్లా ఉద్యమంలో మేము సైతం

**– 40 రోజు రిలే దీక్షల్లో రిటైర్డ్ ఉద్యోగ, ఉపాధ్యాయులు.**

(ఆలూరు మనగళం): వెనుకబాటుకు గురైన ఆలూరు ప్రాంతం విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో అభివృద్ధి చెందాలంటే ఆదోనిను జిల్లాగా ప్రకటించాలని స్టేట్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు నాగరాజు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆలూరు తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, కుమ్మరి గోవిందప్ప కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆలూరు జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్ష 40వ రోజుకు చేరుకుంది ఈ దీక్షలో రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో వీరస్వామి, మజర్ భాష, ఆనంద్ రావు, తిమ్మప్ప, ఈరన్న, గిరయ్య, నూర్ అహమ్మద్, బుసప్ప, మహేష్, ఈశ్వరప్ప దీక్షల్లో కూర్చున్నారు. వీరికి వైసిపి నాయకులు కొట్టాల రాజు, కాంగ్రెస్ ఇంచార్జీ పూల రామాంజినేయులు, ఉపాధ్యాయులు గాదిలింగప్ప, యూసుఫ్, మౌనేశ్వర్, సురేంద్ర, మార్పు సంస్థ ప్రతినిధి వేమిరెడ్డి, మైనారిటీ నాయకులు దాదా భాష, సంగీబావం ప్రకటించారు. జెఎసి నాయకులు భూపేష్, కత్తి రామాంజినేయులు, ఎల్లప్ప మాట్లాడుతూ 5 నియోజకవర్గాల ప్రజల ఆకాంక్షను పరిగణలోకి తీసుకుని ప్రభుత్వం ఆదోనిను జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే 24న జరిగే బంద్ కు సంపూర్ణ సహకారం అందించాలని పిలుపునిచ్చారు.



# ఘనంగా వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవం

మన గళం అవుకు : నంద్యాల జిల్లా అవుకు పట్టణంలో వెలసిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం నందు మంగళవారం అమ్మవారి ఆత్మపరపున దినోత్సవం అత్యంత వైభవంగా ముగిసినది. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, ఆర్యవైశ్య మహిళా సంఘం వారు మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు ఆడబిడ్డ ఇలవేల్పు అయినా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవ సందర్భంగా వేకువ జామున నుండి అమ్మవారికి అర్చనలు అభిషేకము శాస్త్ర కుంకుమార్చనలు నిర్వహించడం జరిగింది. పూజా కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేయడం జరిగిందన్నారు.



# అర్బన్ క్రూయిజర్ ఎబెల్లా..

హైదరాబాద్ ,20 జనవరి 2026 :మనగళం : భారత ఆటోమొబైల్ రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న జపాన్ దిగ్గజ సంస్థ టయోటా ఎలక్ట్రిక్ వాహన విభాగంలోకి అధికారికంగా అడుగుపెట్టింది. దేశీయ మార్కెట్ కోసం తన తొలి పూర్తిస్థాయి విద్యుత్ కారు అర్బన్ క్రూయిజర్ ఎబెల్లాను విడుదల చేసింది. మధ్యతరహా కారు విభాగానికి చెందిన ఈ వాహనం కోసం దేశవ్యాప్తంగా 25000 టోకెన్ మొత్తంతో బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. త్వరలోనే అధికారిక ధరలను ప్రకటించనున్నారు. దేశంలో విద్యుత్ వాహనాలపై పెరుగుతున్న ఆసక్తిని దృష్టిలో ఉంచుకుని ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ తెలిపింది. ఈ కారు మారుతీ సుజుకీ ఈ విటారా వేదిక ఆధారంగా రూపుదిద్దుకున్నప్పటికీ టయోటా తనదైన ప్రత్యేక రూపకల్పన మార్పులతో వినియోగదారుల ముందుకు తీసుకొచ్చింది. ఇప్పటికే మార్కెట్‌లో ఉన్న హ్యుందాయ్ క్రెటా విద్యుత్ కారు, ఎంజీ జెడ్ ఎస్ విద్యుత్ కారు, టాటా కర్వ్ విద్యుత్ కారు మోడళ్లకు గట్టి పోటీ ఇవ్వనుంది. ఈ కారును రెండు బ్యాటరీ ఎంపికలతో అందిస్తున్నారు. ఒకటి 49 సామర్థ్య బ్యాటరీ కాగా ఇది 142 శక్తి, 189 టార్క్‌ను అందిస్తుంది. రెండవది 69 సామర్థ్య బ్యాటరీ కాగా ఇది 172 శక్తి, 189 టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఈ పెద్ద బ్యాటరీ వేరియంట్ ఒక్కసారి పూర్తిగా చార్జ్ చేస్తే గరిష్టంగా 543 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుందని సంస్థ వెల్లడించింది. డిజైన్ పరంగా ముందుభాగంలో ఆకర్షణీయమైన లైట్లు, కొత్త బంపర్, టయోటా గుర్తు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

# సూచీలు కుప్పకూలాయే.. వేల పాయింట్ల నష్టం.. అసలు కారణాలేంటి..?

హైదరాబాద్ 20 జనవరి 2026 , మనగళం : వరుస నష్టాలతో ఇప్పటికే ఒత్తిడిలో ఉన్న దేశీయ సూచీలు మంగళవారం భారీగా కుప్పకూలాయి. ప్రధాన సూచీ ఏకంగా 1065 పాయింట్లు పడిపోయి మదుపర్లను భయాందోళనకు గురి చేసింది. యూరప్ దేశాలతో అమెరికా మధ్య వాణిజ్య యుద్ధం ముదిరి పోవడం వల్ల అంతర్జాతీయంగా ప్రతికూల వాతావరణం నెలకొంది. ఇదే సమయంలో సోమవారం విదేశీ మదుపర్లు 3262 కోట్ల విలువైన షేర్లను అమ్మేయడం మార్కెట్‌పై తీవ్ర ప్రభావం చూపింది. అమెరికా కరెన్సీతో పోల్చితే రూపాయి మరింత బలహీనపడటం, ముడిచమురు ధరలు పెరగడం, సంస్థలు ప్రకటిస్తున్న మూడో త్రైమాసిక ఫలితాలు ఆశాజనకంగా లేకపోవడం కూడా నష్టాలకు కారణాలుగా మారాయి. ఉదయం స్వల్ప ఊగిసలాట తర్వాత మధ్యాహ్నం నుంచి అమ్మకాలు పెరిగిపోవడంతో ప్రధాన సూచీ 82180 వద్ద ముగియగా, జాతీయ ప్రధాన సూచీ 353 పాయింట్లు పడిపోయి 25232 వద్ద స్థిరపడింది. హిందుస్థాన్ జింక్, దాల్మియా భారత్, టాటా కన్స్యూమర్, గోద్రేజ్ కన్స్యూమర్ స్వల్ప లాభాల్లో నిలవగా, ఒబెరియా రియాల్టీ, యూపీఎల్, ఎల్‌టీఐ మైండ్ ట్రీ, హవెల్స్ ఇండియా, ప్రెస్టీజ్ ఎస్టేట్స్ భారీ నష్టాలు చవిచూశాయి. బ్యాంకింగ్ సూచీ 487 పాయింట్లు పడిపోగా, మధ్యస్థ సంస్థల సూచీ 1562 పాయింట్లు నష్టపోయింది. అంతర్జాతీయ అనిశ్చితి కొనసాగితే రాబోయే రోజుల్లో కూడా మార్కెట్‌పై ఒత్తిడి కొనసాగే అవకాశముందని నిపుణులు అంచనా వేస్తున్నారుద.

# రైల్వే జనరల్ మేనేజర్ కి వినతి పత్రం సమర్పించిన కాంగ్రెస్ పార్టీ

**– డోన్ లో వందే భారత్ ఎక్స్ ప్రెస్ రైలు ను నిలుపుదల చేయాలి**

**– డోన్ లో లిఫ్ట్,ర్యాంప్, ఎస్కలేటర్ సౌకర్యం, ఏర్పాటు చేయాలి**

**– దొరపల్లి దగ్గర సర్వీస్ రోడ్ కు అనుమతి ఇస్తూ డోన్ పట్టణములో మరియు దొరపల్లి బ్రిడ్జి సమీపములో రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి లను ఏర్పాటు చేయాలి**

**– మల్కాపురం రైల్వే స్టేషన్ దగ్గర ఫుట్ ఓవర్ బ్రిడ్జి ని ఏర్పాటు చేయాలి**

**– రైల్వే స్టేషన్ వెలుపల నాసిరకం తారు రోడ్ ను క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ తో విచారించి తగు చర్యలు తీసుకోవాలి**

**– రైల్వే స్టేషన్ లలో ఫ్లాట్ఫారం పై గ్రానైట్ టైల్స్ బండలు నిబంధనలకు విరుద్ధంగా వేసిన వారి పై చర్యలు తీసుకోవాలి**

**– నంద్యాల లలో మరియు డోన్ రైల్వే స్టేషన్ లలో రిటైరింగ్ డార్మెటరీ రూమ్ లను ఏర్పాటు చేయాలి**

**– తుంగభద్ర ఎక్స్ ప్రెస్ రైల్ ను డోన్ వరకు పొడిగించాలి, మరియు రైలు నెంబర్ 17227/28 కలిగిన రైల్ ను ప్రతి రైల్వే స్టేషన్ లో ఆపాలి**

**– కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, న్యాయవాది డాక్టర్ గార్లపాటి మద్దులేటీ స్వామి,డిసిసి ఉపాధ్యక్షులున్యాయవాది ఉన్నిగొర్ల జనార్దన్ ల డిమాండ్**

మన గళండోన్ రైల్వే స్టేషన్ ను రైల్వే జనరల్ మేనేజర్ సాధారణ తనిఖీలలో భాగంగా ఈరోజు మంగళవారం సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, న్యాయవాది డాక్టర్ గార్లపాటి మద్దులేటీ స్వామి,ఆధ్వర్యంలో ఒక వినతి పత్రం అందజేశారు.నంద్యాల

**: నంద్యాల జిల్లా డిసిసి అధ్యక్షులు**

జిల్లాలో అనేక రైల్వే స్టేషన్ లలో అనేక రకాల సమస్యలు ఉన్నాయని అందులో ప్రదానంగా గుంతకల్ రైల్వే డివిజన్ లో డోన్ రైల్వే జంక్షన్ అతి పెద్దది, అయితే ఇక్కడ నుంచి ఢిల్లీ వరకు అనేక మంది పారిశ్రామిక వేత్తలు, రాజకీయ నాయకులు, ఉన్నత ఉద్యోగస్థులు ప్రయాణం చేస్తూ ఉంటారు.కావున వందే భారత్ ట్రైన్ డోన్ లో ఆపాలని,పరిసర ప్రాంతాల ప్రయాణీకులకు సీనియర్ సిటిజన్లు, మహిళలు మరియు వికలాంగుల ప్రయాణీకులకు సౌకర్యం కొరకు రైల్వే స్టేషన్‌లో లిఫ్ట్, ర్యాంప్, ఎస్కలేటర్ సౌకర్యాలను ఏర్పాటు చేయాలని, వీటితో పాటు, నిత్యం ట్రాఫిక్ తో ఇబ్బంది పడుతూ అనేక అవస్థలు పడుతూ ప్రమాదాల కు కారణం అవుతు ఇబ్బంది పడుతున్న ప్రజల అవసరం నిమిత్తం డోన్ కర్నూల్ గేట్ల దగ్గర ఒక అండర్ పాస్ బ్రిడ్జి ని మరియు అనేక గ్రామాలకు వెళ్ళడానికి దొరపల్లి దగ్గర సర్వీస్ రోడ్ లకు అనుమతి ఇస్తూ అక్కడే ఒక రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి ని, నిర్మించాలని, కర్నూల్, నంద్యాల జిల్లాలో అనేక రైల్వే స్టేషన్లలో ప్లాట్ ఫారంపై గ్రానైట్ పాలిష్ బండలు నిబంధనలకు విరుద్ధంగా వేయడం వల్ల అనేకమంది చిన్న పిల్లలు, వృద్ధులు, వికలాంగులు జారీ క్రింద పడి ప్రమాదానికి గురి అవుతున్నారు, మరియు రైల్వే స్టేషన్ వెలుపల నూతనంగా ఒక తారు రోడ్ వేసారు అది నాసి రకంతో వేసారు, కావున దానిని క్వాలిటీ కంట్రోల్ తో పరిశీలించి కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని, గుంతకల్లు నుంచి నంద్యాల కువెళ్లే రైలు డోన్ లో ఉదయం 8 గంటలకు చేరు కొనే విధంగా మరొక పాసింజర్ రైలు ను నడపాలని, కర్నూల్ వరకు వచ్చే తుంగభద్ర ఎక్స్ ప్రెస్ రైల్ ను డోన్ వరకు పొడింగించాలని, రైల్ నెంబర్ 17227/28 ను ప్రతి రైల్వే స్టేషన్ లో ఆపాలని, డోన్, నంద్యాల రైల్వే స్టేషన్‌లు అతిపెద్ద జంక్షన్ కలిగి ప్రయాణికుల రద్దీ ఎక్కువ వీరి సౌకర్యం నిమిత్తం రిటైరింగ్ రూంలు, డార్మెటరీ సౌకర్యం కల్పించాలని,




మల్కాపురం రైల్వే స్టేషన్ లో మైనింగ్ ఎక్కవ ఇక్కడ అనేక రకాల గూడ్స్ రైలు వచ్చి లోడింగ్ జరగడం వాళ్ళ వలసల గ్రామానికి, బ్యాంకు, స్కూల్ పోవడానికి చాలా ఇబ్బంది ఉన్నది అందుకు ఈ స్టేషన్ లో ఒక ఫుట్ ఓవర్ బ్రిడ్జి వేయాలనే డిమాండ్ తో కాంగ్రెస్ పార్టీ ఒక వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ అంశాలకు సానుకూలంగా స్పందించడం జరిగింది. ఈ కార్యక్రమం లో న్యాయవాదులు డిసిసి ఉపాధ్యక్షులు ఉన్నిగొర్ల జనార్దన్, డిసిసి ప్రధాన కార్యదర్శి వడ్డే రాజశేఖర్, నాయకులు సుమన్, మోహన్, నవీన్ లు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## ఆలింగనం... మాటలకు అందని మానవీయ భాష

మనిషి చరిత్రను తిరగేస్తే, నాగరికతలు మారాయి, రాజ్యాలు కూలాయి, సాంకేతికత ఆకాశాన్ని తాకింది. కానీ మారని ఒకే ఒక మౌలిక అవసరం ఉంది. మానవీయ స్పర్శ. అదే ఆలింగనం. మాటలు లేకపోయినా, భాష తెలియకపోయినా, ఒక ఆలింగనం భావాలను అర్థం చేయగలదు. అంతర్జాతీయ ఆలింగన దినోత్సవం మనిషి జీవనంలో ఈ అత్యంత సరళమైన కానీ అత్యంత లోతైన మానవీయ విలువను మరోసారి మన ముందుంచుతుంది.

ఆలింగనం ప్రేమకు మాత్రమే పరిమితం కాదు. అది భయం తొలగించే ధైర్యం. బాధలో ఉన్నవారికి ఇచ్చే ఓదార్పు. ఓటమిని ఎదుర్కొన్నవారికి మళ్లీ నిలబడే శక్తి. మాటలతో చెప్పలేని బాధను, కన్నీళ్లతో వ్యక్తం చేయలేని వేదనను ఆలింగనం నిశ్శబ్దంగా అర్థం చేసుకుంటుంది. కొన్ని సందర్భాల్లో "నేను ఉన్నాను" అనే మాట అవసరం ఉండదు. ఒక గాఢమైన ఆలింగనం చాలు.

పిల్లల జీవితంలో ఆలింగనం పాత్ర అమోఘం. తల్లి ఒడిలో దొరికే భద్రతే జీవితాంతం వారి మనసులో నిలిచే ధైర్యం. తల్లిదండ్రులు ప్రేమగా ఆలింగనం చేసుకున్న పిల్లలు భావోద్వేగంగా బలంగా ఎదుగుతారు. వారు తమ భావాలను దాచుకోరు, భయపడరు, ఇతరుల బాధను అర్థం చేసుకునే మనసుతో పెరుగుతారు. కానీ ప్రేమను మాటలకే పరిమితం చేసి, స్పర్శను దూరం పెట్టే కుటుంబాల్లో పిల్లలు ఒంటరితనాన్ని తొందరగా నేర్చుకుంటారు.

వృద్ధుల జీవితంలో ఆలింగనం మరింత అవసరం. బాధ్యతలు తగ్గిన తర్వాత, శారీరక శక్తి క్షీణించిన సమయంలో వారికి అవసరం సానుభూతి, గౌరవం, ప్రేమ. ఒక ఆలింగనం వారికి "మీరు ఇంకా అవసరమే" అనే భావనను కలిగిస్తుంది. వృద్ధాశ్రమాల్లో, ఒంటరిగా జీవిస్తున్న వృద్ధుల్లో కనిపించే మౌన వేదనకు ఆలింగనం ఒక మానవీయ ఔషధంలా పనిచేస్తుంది.

నేటి సమాజంలో ఒంటరితనం ఒక పెద్ద సామాజిక సమస్యగా మారింది. ఒకే ఇంట్లో ఉన్నా మనుషులు దూరమవుతున్నారు. తెరల వెనక జీవితం సాగుతోంది. వేల మంది పరిచయాలు ఉన్నా, మనసు విప్పి మాట్లాడుకునే వ్యక్తి లేకపోవడం అనేక మందిని లోపలగా ఖాళీగా చేస్తోంది. ఈ మానసిక ఒత్తిడి అనేక సమస్యలకు దారితీస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆలింగనం ఒక నిర్లక్ష్యానికి గురైన పరిష్కారంగా మారింది. ఇది ఖర్చు లేని, ప్రతిఫలం ఆశించని, కానీ అపారమైన మానసిక శక్తిని ఇచ్చే చర్య.

సమాజంలో ఆలింగనానికి సంబంధించి అపార్థాలు కూడా ఉన్నాయి. స్పర్శను బలహీనతగా చూడడం, భావోద్వేగాలను దాచుకోవడమే బలమని భావించడం మన సంస్కృతిలో కొంతకాలంగా పెరుగుతున్న ధోరణి. కానీ నిజమైన బలం భావాలను అర్థం చేసుకోవడంలో, అవసరమైనప్పుడు ప్రేమగా దగ్గర కావడంలోనే ఉంది. గౌరవం, అనుమతి, మర్యాదలతో కూడిన ఆలింగనం ఎలాంటి అపార్థాలకు తావివ్వదు. అది మనుషుల మధ్య నమ్మకాన్ని పెంచుతుంది.

ఆలింగనం ఒక సామాజిక ఐక్యతకు సంకేతం కూడా. కులం, మతం, భాష, ప్రాంతం అనే గీతలను దాటి మనుషులను దగ్గర చేస్తుంది. విభజనలతో నిండిన ఈ కాలంలో, మనిషిని మనిషిగా చూసే దృష్టిని పెంపొందిస్తుంది. ప్రకృతి విపత్తుల సమయంలో, సామాజిక సంక్షోభాల్లో, ఒకరి బాధను మరొకరు పంచుకునే తొలి అడుగు ఆలింగనమే అవుతుంది.

అంతర్జాతీయ ఆలింగన దినోత్సవం మనకు ఒక స్పష్టమైన సందేశం ఇస్తుంది. మనం మనుషులం, యంత్రాలు కాదు. మన జీవితాల్లో స్పర్శకు మళ్లీ స్థానం ఇవ్వాలి. మన ఇళ్లలో పిల్లలను ప్రేమగా దగ్గర చేసుకోవాలి. మన వృద్ధులను గౌరవంతో ఆలింగనం చేసుకోవాలి. మన స్నేహితులను, సహచరులను అవసరమైనప్పుడు ధైర్యంగా దగ్గర కావాలి. ఎందుకంటే ఒక నిజమైన ఆలింగనం కేవలం ఒక క్షణం మాత్రమే కాదు. అది ఒక జీవితానికి ఇచ్చే భరోసా, ఒక సమాజాన్ని మళ్లీ మానవీయంగా మార్చే శక్తి. కుటుంబాల్లో ఆలింగనం తగ్గిపోతున్న కొద్దీ, భావోద్వేగాల వ్యక్తీకరణ కూడా తగ్గుతోంది. పిల్లల్ని ప్రేమతో ఆలింగనం చేసుకునే తల్లిదండ్రులు తగ్గితే, ఆ పిల్లలు పెద్దయ్యాక తమ భావాలను దాచుకోవడం నేర్చుకుంటారు. వృద్ధులను ప్రేమగా దగ్గర చేసుకునే అలవాటు తగ్గితే, వారు అనవసరంగా ఒంటరితనంలోకి నెట్టబడతారు. స్నేహితుల మధ్యనూ, సహోద్యోగుల మధ్యనూ స్పర్శకు స్థానం లేకపోవడం అనుమానాలకు, అపార్థాలకు దారితీస్తోంది. గౌరవం, అనుమతి, మర్యాదలతో కూడిన ఆలింగనం ఈ గోడలను కూల్చే శక్తి కలిగి ఉంది. ఆలింగనం ఒక సామాజిక సందేశం కూడా. మనిషిని మనిషిగా చూసే దృష్టిని పెంపొందిస్తుంది. కులం, మతం, భాష, హోదా అనే గీతలను దాటి మనుషులను దగ్గర చేస్తుంది. విభజనలతో నిండిన కాలంలో, ఐక్యతను గుర్తు చేసే చిన్న కానీ ప్రభావవంతమైన చర్య ఇది. ఒకరి బాధను మన బాధగా భావించే భావనకు ఆలింగనం తొలి అడుగు. అంతర్జాతీయ ఆలింగన దినోత్సవం మనకు ఒక ప్రశ్న వేస్తుంది. మన చుట్టూ ఉన్నవారికి మనం ఎంత దగ్గరగా ఉన్నాం? మన ప్రేమను చెప్పడానికి మాటలకే పరిమితమవుతున్నామా? లేక మనసుతో, స్పర్శతో కూడా వ్యక్తం చేస్తున్నామా? ఈ రోజు ఒక నిర్ణయానికి రావాలి. మన ఇళ్లలో, మన స్నేహాల్లో, మన సమాజంలో ఆలింగనానికి మళ్లీ స్థానం కల్పించాలి. ఎందుకంటే ఒక నిజమైన ఆలింగనం కేవలం ఒక క్షణం మాత్రమే కాదు. అది ఒక జీవితానికి ఇచ్చే ధైర్యం, ఒక మనసుకు ఇచ్చే భరోసా.


# ప్రజలకు హాని కలిగించే ప్రదేశంలో ఎయిర్టెల్ టవర్ నిర్మించవద్దు


**వృద్ధులు, గర్భిణీ స్త్రీలు, పిల్లలకు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి.**
**- సెల్ టవర్ రేడియేషన్ వల్ల తలనొప్పి, నిద్రలేమి, రక్త పోటు, క్యాన్సర్ సమస్యలు వచ్చే అవకాశం.**
**- ఆలూరు మారుతీ నగర్ కాలనీ వాసులు.**





(ఆలూరు మనగళం): ఆలూరు మండల కేంద్రంలో మారుతీ నగర్ కాలనీలో ఎయిర్టెల్ సంస్థ కొత్తగా 45 అడుగుల టవర్ నిర్మిస్తుంది. ఎయిర్టెల్ సంస్థ వారు మండల పరిషత్ డెవలప్మెంట్ ఆఫీసర్, మండల రెవిన్యూ ఆఫీసర్, ఆలూరు పంచాయతీ సెక్రటరీ, అధికారులును కలిసి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా రాత్రికి రాత్రే ఎయిర్టెల్ టవర్ నిర్మిస్తున్నారు. ఎయిర్టెల్ యాజమాన్యం పై స్థానికంగా ఉన్న మారుతీ నగర్ కాలనీ వాసులు సదరు సంబంధిత అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆలూరు మండలం రెవిన్యూ, ఎంపీడీఓ, పంచాయతీ సెక్రటరీ అధికారులను కాలనీ వాసులు కలసి వివరణ కోరగా, మాకు నూతనంగా ఎయిర్టెల్ టవర్ నిర్మిస్తున్నట్లు ఎటువంటి అనుమతులు కోరినట్లు మా దృష్టికి రాలేదు. మీరు మా ద్రుష్టికి తీసుకోరావడంతో టవర్ నిర్మాణం గురించి మాకు తెలిసింది, వెంటనే లొకేషన్లోకి వచ్చి విచారణ చేసి సమస్యకు పరిష్కారం చేస్తామని ఎంపీడీఓ మద్దిలేటి స్వామి హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఇంతకుముందు చెరువు దగ్గరలో సెల్ టవర్లు నిర్మించినారు, వాటి పక్కన ఉన్న ప్రజలు ఆల్రెడీ అనారోగ్య సమస్యలతో ఇబ్బందులకు గురివుతున్నారు. ఎయిర్టెల్ టవర్ నిర్మాణానికి గాని, టవర్ కొరకు స్థలం ఇచ్చినవారికి గాని మారుతీ నగర్ కాలనీ వాసులు వెతిరేకం కాదు అని తెలిపారు. కాకపోతే టవర్ నిర్మాణం జనం ఉండే ప్రదేశంలో కాకుండా ఊరి బయట నిర్మించాలని కాలనీ వాసులు కోరారు. మా కాలనీలో ఎయిర్టెల్ కంపెనీ వారు 45 అడుగుల ఎత్తులో మొబైల్ టవర్ ను ఏర్పాటు వల్ల మా కాలనీ ప్రజలకు ముఖ్యంగా చిన్నపిల్లలకు మరియు వృద్ధులకు గర్భిణీ స్త్రీలకు ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. మా నివాస ప్రాంతం పూర్తిగా జనసంద్రంగా ఎక్కువగా ఉన్న ప్రాంతం మొబైల్ టవర్ల నుండి వెలబడే రేడియేషన్ వల్ల తలనొప్పి, నిద్రలేమి, రక్తపోటు, క్యాన్సర్ వంటి ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. ఈ టవర్ ఏర్పాటు చేయడానికి సంబంధించిన స్థానిక ప్రజలు అనుమతి తీసుకోలేదు. ఈ టవర్ ను తక్షమే నిలిపివేయవలసిందిగా మనవి మరియు హానికరం కానీ ప్రదేశానికి మార్చవలసిందిగా కోరుచున్నాము. ఎటువంటి ప్రభుత్వ ఉత్తర్వులు లేకుండా టవర్ కడుతున్నారని తెలిసినది అందువల్ల కాలనీవాసుల సంతకాల సేకరణతో సంబంధిత అధికారులకు విన్నవించుకున్నాము. ఎయిర్టెల్ సంస్థ యాజమాన్యం, స్థల కేటాయించిన వారు, ఈ విషయంపై స్థానికులంగా స్పందిస్తారని మారుతి నగర్ కాలనీవాసులు ఆశిస్తున్నాము.





# డోన్ రైల్వే స్టేషన్ సమస్యలపై జిఎం కు ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి వినతి





మన గళండోన్ : డోన్ రైల్వే స్టేషన్లో తనిఖీ నిర్వహించిన జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవత్సవ్ వార్షిక తనిఖీల్లో భాగంగా ఈరోజు మంగళవారం సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ శ్రీ సంజయ్ కుమార్ శ్రీవత్సవ్ గుంతకల్ డివిజన్ పరిధిలో బళ్లారి నుంచి నంద్యాల వరకు రైల్వే విభాగానికి చెందిన ప్రాంతాలను పరిశీలించారు. ఈ తనిఖీ సందర్భంగా డోన్ రైల్వే స్టేషన్ను సందర్శించి పలు అంశాలను సమీక్షించారు. డోన్ రైల్వే స్టేషన్లోని స్టేషన్ భవనం, ప్లాట్ఫాంలు, లాబీ, రన్నింగ్ రూమ్లలో ఉన్న సదుపాయాలు, ప్రయాణికుల ఫిర్యాదులు, అలాగే స్టేషన్ పరిధిలో అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను జనరల్ మేనేజర్ నిశితంగా పరిశీలించారు. లోపాలు గుర్తించిన చోట తక్షణ చర్యలు తీసుకోవాలని అధి కారులకు సూచించారు. ఈ సందర్భంగా డోన్ నియోజకవర్గం ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి జనరల్ మేనేజర్తో సమావేశమై, డోన్ రైల్వే స్టేషన్ సమీపంలో కొత్త బుగ్గ ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం, దొర పల్లె దగ్గర సర్వీస్ రోడ్డు కోసం పర్మిషన్, పాతపేట రామాలయం దగ్గర రైల్వే అండర్ బ్రిడ్జి శాంక్షన్, పాతపేట పూల మార్కెట్ సమీపంలో ర్యాంపు పర్మిషన్ కోసం వినతి, బేతంచర్ల రోడ్డులో గోడను 10 అడుగుల వరకు జరపాలని విజ్ఞప్తి చేశారు. ఉదయం 6.30 గంటలకు డోన్ నంద్యాల కు వెళ్లే గుంటూరు ఎక్స్ప్రెస్ ట్రైన్ నాలుగో ఫ్లాట్ ఫామ్ నుంచి మొదలవడం వలన ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అలా కాకుండా ఒకటి రెండు మూడు ప్లాట్ ఫామ్ ల దగ్గర నుంచి ట్రైన్ ప్రారంభించాలి. లిఫ్ట్ ఎస్కలేటర్లు, టికెట్ కౌంటర్, ఏర్పాటు చేయాలి. కర్ణాటక, సంపర్ క్రాంతి ఎక్స్ప్రెస్ లను స్టాపింగ్ ను ఏర్పాటు చేయాలని అభ్యర్థించారు. మరియు ప్రయాణికుల సౌకర్యాల మెరుగుదల వంటి పలు కీలక అంశాలపై చర్చించారు. అలాగే ఈ తనిఖీ సమయంలో బీజేపీ నాయకులు మరియు వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు తమ సమస్యలను వివరించి అనంతరం అర్జీలను జనరల్ మేనేజర్కు అందజేశారు


# బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన నితిన్ నబీన్ సిన్హా

**- శుభాకాంక్షలు తెలియజేసిన బీజేపీ రాష్ట్ర నాయకులు హేమసుందర్ రెడ్డి**
**- ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో జేపీ నడ్డా నుంచి బాధ్యతలు స్వీకరించిన నితిన్ నబీన్**

మన గళండోన్ : ప్రధాని మోదీ, అమిత్షా, జేపీ నడ్డా, పలువురు కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు సమక్షంలో నితిన్ నబీన్ బాధ్యతల స్వీకరణ కార్యక్రమం లో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేసారు అని డోన్ బీజేపీ నాయకులు అన్నారు. 45 సంవత్సరాల వయసులో బీజేపీ జాతీయ అధ్యక్ష పగ్గాలు చేపట్టిన అతిపిన్న వ్యక్తిగా నితిన్ నబీన్ రికార్డ్సృష్టించారు అని అన్నారు భారత ప్రధాని కూడా నేను బీజేపీ కార్యకర్తను నా బాస్ నితిన్ నబీన్ అన్నారు ఇంతటి మహోన్నత మైన పార్టీ బీజేపీ పార్టీ అని, ప్రపంచంలో ఏ పార్టీ కి లేని సభ్యత్వం మరియు ఆదరణ కలిగిన పార్టీ బీజేపీ పార్టీ అని బీజేపీ నాయకులు హేమసుందర్ రెడ్డి తెలియజేసారు.



## శ్రీ సుబ్రహ్మణ్య స్వామి వారికి విశేష అభిషేకం



మనగళం శ్రీశైలం : లోకకల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (20.01.2026) ఉదయం ఆలయ ప్రాంగణంలోని శ్రీసుబ్రహ్మణ్య స్వామి (కుమారస్వామి) వారికి విశేష పూజలను నిర్వహించడం జరిగింది. ప్రతి మంగళవారం మరియు కృత్తి కానక్షత్రం, షష్ఠి తిథి రోజులలో శ్రీ సుబ్రహ్మణ్య స్వామి వారికి ఈ విశేష అభిషేకం మరియు పూజా దికాలు దేవస్థానం సేవగా (సర్కారిసేవగా) నిర్వహించ బడుతున్నాయి. కుమార స్వామి వారికి పూజలు జరపడం వలన లోకకల్యాణమే కాకుండా ప్రతి ఒక్కరికి ఉద్యోగ, వ్యాపార, వ్యవహా రాలలో ఆటుపోట్లు తొలగి ఆయా పనులు సక్రమంగా జరుగుతాయి. సుబ్రహ్మణ్య స్వామి అనుగ్రహంతో శత్రుబాధలు, గ్రహపీడలు, దృష్టి దోషాలు మొదలైనవి తొలగిపోతాయి. అలాగే సంతానం కోసం పూజించేవారికి తప్పక సంతానభాగ్యం లభిస్తుందని చెప్పబడుతోంది. ఈ అభిషేకానికి ముందుగా దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరీ త్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్ధిగా ఉండాలని, జనులకు ఆయు రారోగ్యాలు కలిగివారికి అకాలమరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్ని ప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, జనులందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహా గణపతి పూజ జరిపించ బడింది. అనంతరం శ్రీసుబ్రహ్మణ్య స్వామి వారికి అభిషేకము, అర్చన తరువాత సుబ్రహ్మణ్యస్తోత్ర పారాయణలు చేయబడ్డాయి. సుబ్రహ్మణ్య స్వామి అభిషేకంలో స్వామి వారికి పంచామృతాలైన పాలు, పెరుగు, తేనె, నెయ్యి, కొబ్బరి నీళ్ళు మరియు వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ముఖ్యంగా వివిధ పండ్ల రసాలతో చేసే అభిషేకంతో ఎంతో ఫలితం ఉంటుందని ఆగమాలు చెబుతున్నాయి.

## కేవలం రూ.200తో రూ.10లక్షలు..





న్యూఢిల్లీ ,20 జనవరి,మనగళం : డబ్బు సంపాదించడం ఒక విషయం అయితే దాన్ని భద్రంగా దాచుకుని పెంచుకోవడం మరో ముఖ్యమైన విషయం. ప్రమాదం లేని పెట్టుబడి కావాలనుకునే వారికి తపాలా శాఖ అందిస్తున్న పునరావృత డిపాజిట్ పథకం మంచి అవకాశం. రోజువారీ ఖర్చులలో నుంచి కేవలం రూ.200 పొదుపు చేస్తే కొన్నేళ్లలోనే మీ చేతికి రూ.10 లక్షలకు పైగా మొత్తం చేరే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ భరోసాతో సాగే ఈ పథకం సామాన్యులకు భద్రతతో పాటు స్థిరమైన లాభాన్ని అందిస్తోంది.ఈ పథకంలో కనీసంగా రూ.100తో ఖాతాను ప్రారంభించవచ్చు. ప్రస్తుతం సంవత్సరానికి 6.7 శాతం వడ్డీ అమల్లో ఉంది. వడ్డీని ప్రతి మూడు నెలలకు ఒకసారి లెక్కించడంతో డబ్బు వేగంగా పెరుగుతుంది. ఖాతా ప్రారంభించిన ఏడాది తర్వాత మీ జమపై 50 శాతం వరకు తక్కువ వడ్డీతో రుణం పొందే సౌకర్యం కూడా ఉంది.మీరు రోజుకు రూ.200 అంటే నెలకు రూ.6000 జమ చేస్తే మొదటి 5 ఏళ్లలో మొత్తం రూ.360000 పెట్టుబడి అవుతుంది. వడ్డీతో కలిపి దాదాపు రూ.428197 వరకు లభిస్తుంది. ఇదే పథకాన్ని మరో 5 ఏళ్లు కొనసాగిస్తే మొత్తం పెట్టుబడి రూ.720000 అవుతుంది. పది సంవత్సరాల చివరికి చక్రవడ్డీతో కలిపి సుమారు రూ.1025131 వరకు అందుకునే అవకాశం ఉంటుంది. క్రమశిక్షణగా పొదుపు చేస్తే చిన్న మొత్తమే పెద్ద సంపదగా మారుతుంది.అత్యవసర పరిస్థితుల్లో మూడు సంవత్సరాల తర్వాత ఖాతాను మూసివేసుకునే అవకాశం కూడా ఉంది. పిల్లల చదువు, వివాహం, భవిష్యత్తు అవసరాలు, విశ్రాంతి జీవితం కోసం భద్రతతో కూడిన పొదుపు కావాలనుకునే వారికి ఈ పథకం ఒక మంచి మార్గంగా నిలుస్తోంది.

## నందీశ్వరస్వామికి విశేషపూజ



మనగళం శ్రీశైలం : లోక కల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు ( 20.01.2026) ఆలయప్రాంగణంలోని నందీశ్వర స్వామికి (శనగల బసవన్న స్వామివారికి) విశేషార్చనలను నిర్వహించనున్నది.ప్రతి మంగళవారం మరియు త్రయోదశి రోజున దేవస్థానసేవగా (సర్కారీసేవగా) ఈ కైంకర్యం జరిపించ బడుతోంది. ప్రదోషకాలంలో అనగా సాయం సంధ్యా సమయంలో ఈ విశేష పూజలు నిర్వహించడం జరుగుతోంది. ఈ విశేషార్చనలో ముందుగా లోక క్షేమాన్ని కాంక్షిస్తూ దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరిత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్ధిగా ఉండాలని, జనులకు ఆయు రారోగ్యాలు కలిగి వారికి అకాల మరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్ని ప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, జనులందరూ సుఖ శాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు, వేదపండితులు సంకల్పాన్ని చెప్పడం జరుగుతుంది. అనంతరం కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహా గణపతి పూజను జరిపించ బడుతుంది.ఆ తరువాత నందీశ్వర స్వామికి శాస్త్రోక్తంగా పంచామృతాలతోనూ, ఫలోదకాలతో హరిద్రోదకం,కుంకుమోదకం, గంధోదకం, భస్మోదకం, రుద్రాక్షోదకం, బిల్వోదకం, పుష్పోదకం, సువర్ణోదకం మరియు మల్లికాగుండంలోని శుద్ధజలంతో అభిషేకం నిర్వహిస్తారు. తరువాత నందీశ్వర స్వామికి అన్నాభిషేకం నిర్వహించబడుతుంది. వృషభసూక్తం మొదలైన వేద మంత్రా లతో శాస్త్రోక్తంగా ఈ విశేషాభిషేకాన్ని చేయడం జరుగుతుంది. తరువాత నందీశ్వర స్వామి వారికి నూతనవస్త్ర సమర్పణ, విశేష పుష్పార్చనలను చేస్తారు.అనంతరం నానబెట్టిన శనగలను నందీశ్వర స్వామికి సమర్పించడం జరుగుతుంది. చివరగా స్వామికి నివేదన సమర్పించబడుతుంది.

## బయలు వీర భద్ర స్వామికి ప్రదోషకాల అభిషేకం



మనగళం శ్రీశైలం : లోకకల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (20.01.2026) సాయంకాలం శ్రీశైలక్షేత్ర పాలకుడైన శ్రీ బయలు వీర భద్ర స్వామి వారికి విశేష పూజలను జరిపించనున్నది. ప్రతీ మంగళవారం మరియు అమావాస్య రోజులలో బయలు వీర భద్ర స్వామి వారికి ఈ విశేష అభిషేకం, అర్చనలను నిర్వహించ బడుతున్నాయి.బయలు వీర భద్రస్వామి వారు శివభక్తగణాలకు అధిపతి. అదేవిధంగా శ్రీశైలక్షేత్రపాలకుడుగా క్షేత్రానికి ఆరుబయట ఉండి, ఎటువంటి ఆచ్ఛాదన, ఆలయం లేకుండగా బయలుగా దర్శనమిస్తాడు కనుక ఆయనకు బయలు వీర భద్ర స్వామి అని పేరు వచ్చింది. ప్రసన్నవదనంతో కిరీట మకుటాన్ని కలిగి దశభుజుడైన స్వామివారు పది చేతులలో వివిధ ఆయుధాలతో దర్శనమిస్తాడు. స్వామివారికి క్రిందివైపున కుడివైపు దక్షుడు, ఎడమవైపు భద్రకాళి దర్శనమిస్తారు. ఈ స్వామిని దర్శించినంత మాత్రానే ఎంతటి క్లిష్ట సమస్యలైనా తొలగిపోతాయని, వ్యాధులు నశించి ఆయురారోగ్యాలు చేకూరుతాయని ప్రసిద్ధి. ముఖ్యంగా ఆగమసంప్రదాయంలో క్షేత్రపాలక పూజకు చాలా విశేషస్థానం ఉంది. క్షేత్ర పాలకుడికి పూజలు చేయడం వలన ఆ క్షేత్రంలో ఉన్నటువంటి భక్తులు ఎటువంటి భయం,బాధలు లేకుండా సుఖసంతోషాలతో ఉంటారు. మంగళవారం, ఆదివారం మరియు అమావాస్య రోజులలో చేసే వీరభద్రపూజ అనేక ఫలితాలు ఇస్తుందని ఆగమశాస్త్రాలు చెబుతున్నాయి. ఈ స్వామిపూజతో సకలగ్రహ అరిష్టదోషాలు, దుష్టగ్రహపీడలు తొలగిపోతాయి. అదేవిధంగా సంతానం, ఐశ్వర్యం మొదలైన అనేక శుభఫలితాలు చేకూరుతాయి.ఈ పూజా దికాలలో పంచా మృతాలతోనూ, బిల్వోదకం, కుంకు మోదకం, హరిద్రోదకం, భస్మోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్ధజలాలతో స్వామి వారికి అభిషేకం నిర్వహించడం జరుగుతుంది.

## ఆలూరులో ఘనంగా శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవ వేడుకలు

– ముఖ్య అతిధులుగా ఇంచార్జి వైకుంఠం జ్యోతి






(ఆలూరు మనగళం): ఆలూరు మండల కేంద్రంలో వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆలూరు పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం నందు ప్రత్యేక పూజా కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా హాజరైన ఆలూరు టీడీపీ ఇంచార్జి వైకుంఠం జ్యోతి. ఈ కార్యక్రమంలో ఆలూరు నియోజకవర్గం టిడిపి ఇంచార్జి వైకుంఠం జ్యోతి మరియు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఆలూరు ఆర్యవైశ్య నాయకులు, భక్తులు, అమ్మవారికి అభిషేకం మరియు ప్రత్యేక అలంకరణతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదలు స్వీకరించి, కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆశీస్సులు పొందారు.

## అభినందన సభకి ముఖ్య అతిథిగా హాజరు అయిన మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

మన గళం బనగానపల్లె : వైఎస్సార్సీపీ పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి గా ఎన్నికయిన షేక్ అనిల్ బనగానపల్లె పట్టణం వీ.వా ఫంక్షన్ హాల్ నందు అభినందన సభ ఏర్పాటు ముఖ్య అతిథులుగా హాజరు అయిన బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గారు నియోజకవర్గ వైఎస్సార్సీపీ నాయకులు కాటసాని ప్రసాద్ రెడ్డి గారు అవుకు మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి గారు హాజరు అయిన వైఎస్సార్సీపీ రాష్ట్ర మైనార్టీ ప్రధ కార్యదర్శి అత్తర్ జాహీద్ హుస్సేన్ వైఎస్సార్సీపీ రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి అబ్దుల్ ఖైర్ జిల్లా వైఎస్సార్సీపీ యువజన విభాగం అధ్యక్షుడు గుండం నాగేశ్వర్ రెడ్డి వైఎస్సార్సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి అంబటి రవికుమార్ రెడ్డి,వైఎస్సార్సీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ కునుకుంట్ల రామన్న జిల్లా పార్టీ ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి పట్టణ అధ్యక్షుడు అబ్దుల్ ఫైజ్ బనగానపల్లె మండల అధ్యక్షుడు సన్నల జనార్ధన్ రెడ్డి బనగానపల్లె మండల యువజన విభాగం అధ్యక్షుడు తూర్పింటి శ్రీనివాస రెడ్డి నియోజకవర్గ గ్రామ సచివాలయం కన్వీనర్ సుబ్బుతల్లం వైఎస్సార్సీపీ నాయకులు కార్యకర్తలు కష్టపడే వారికే వైఎస్సార్సీపీ పార్టీ పదవులు గ్రామీణ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు వైఎస్సార్సీపీ పార్టీని బలోపేతం చేయండి 2029 ఎన్నికల్లో కాటసాని రామిరెడ్డి గారి విజయమే లక్ష్యం తో పని చేయాలి మనల్ని కష్టపెట్టేవారికి తప్పకుండా వడ్డీతో సహా తిరిగి



చెల్లిస్తాం వైయస్ జగన్ 2.0 కాటసాని రామిరెడ్డి 2.0 తప్పక చూస్తారు అధికారులు కూటమి నాయకులు ఖబడ్దార్



మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

## పరగడుపున నీరు తాగితే కలిగే లాభాలు..



మనగళం : మనలో చాలా మంది ఉదయం లేచిన తర్వాత టీ, కాఫీ తాగడానికి ఇష్టపడతారు. అయినప్పటికీ ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని చాలా మంది ఉదయం గ్రీన్ టీ లేదా ఇతర ఆరోగ్యకరమైన పానీయాలు తీసుకుంటారు. కానీ, ఉదయం నిద్రలేచిన తర్వాత నీటిని తాగడం ఆరోగ్యానికి చాలా రెట్లు ఎక్కువ ప్రయోజనకరంగా ఉంటుంది. ప్రతిరోజూ ఉదయం పళ్ళు తోముకోకుండా నీటిని తాగడం అనేక తీవ్రమైన వ్యాధులను నయం చేస్తుందని మనకు తెలిసిందే. ఉదయం పూట పళ్లు తోముకోకుండా నీటిని తాగడం వల్ల చాలా మేలు జరుగుతుంది. కానీ బ్రష్ చేయకుండా నీటిని 2 గ్లాసుల కంటే ఎక్కువ తాగకూడదు. ఈ సమయంలో శరీరం యాక్టివ్ అవుతుంది. ఎక్కువ నీరు త్రాగడం వల్ల వికారం, వాంతులు సంభవించవచ్చు. మరోవైపు మీరు నీటిని సమతుల్య పద్ధతిలో తాగితే అది పిత్తాన్ని నియంత్రించడంలో సహాయపడుతుంది. జీర్ణక్రియ ప్రక్రియ కూడా సమతుల్యంగా ఉంచుతుంది. అంతే కాకుండా ఇది టాక్సిన్స్ ను తొలగిస్తుంది. పొట్టను శుభ్రపరచడంలో సహాయపడుతుంది. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఎసిడిటీ, పుల్లని త్రేనుపు, కడుపు నొప్పి వంటి అనేక తీవ్రమైన సమస్యలు స్వయంచాలకంగా తగ్గుతాయి. అంతే కాదు రోగ నిరోధక శక్తిని పెంచడంలో కూడా సహాయపడుతుంది. జీర్ణ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఇది బరువును నియంత్రించడంలో కూడా సహాయపడుతుంది. ముఖంలో మెరుపును తెస్తుంది. ఇటువంటి పరిస్థితిలో ఈ కారణాల వల్ల మీరు ముఖం కడుక్కోకుండా నీటిని తాగాలి.

## నిద్రలేమి సమస్యతో బాధపడుతున్నారా..




మనగళం : ఈ రోజుల్లో చాలామంది నిద్రలేమి సమస్యతో బాధపడుతున్న తెలిసిందే. రాత్రిళ్ళు సరిగా నిద్ర పట్టక అనేక రకాల సమస్యలు బారిన పడుతున్నారు. అంతేకాకుండా రాత్రిళ్ళు నిద్రపోవడానికి ఒక చిన్నపాటి యుద్ధం చేస్తున్నారని చెప్పవచ్చు. ఇక నిద్ర పట్టడానికి ఎన్నో ప్రయత్నాలు కూడా చేస్తూ ఉంటారు. రాత్రిళ్ళు నిద్ర సరిగ్గా పట్టగా ఇబ్బంది పడుతున్న వారు వాటి వెనుక విషయాలు ఏంటో తప్పనిసరిగా తెలుసుకోవాలి. అంటే ఎందుకు నిద్ర పట్టడం లేదు దాని వెనుక ఉన్న కారణం ఏంటి అన్న వివరాలు కూడా తెలుసుకోవాలి.నిద్ర లేకపోవడం వల్ల అనేక అనారోగ్య సమస్యలను ఎదుర్కోవలసి వస్తుంది. ప్రస్తుతం చాలామంది నిద్రలేమి సమస్యతో బాధపడుతున్నారు. నిద్రలేమి సమస్య కారణంగా దినచర్య కూడా దెబ్బతింటుంది. చేసే పనిలో ఉత్పాదకత తగ్గుతుంది. మంచి గాఢమైన నిద్రను పొందకపోతే, అందుకు ఇతర కారణాలతో పాటు మీ శరీరంలో విటమిన్ లోపం కూడా కారణం అయ్యి ఉండవచ్చు. అసలు ఏ విటమిన్ లోపిస్తే నిద్రలేమి సమస్య వస్తుంది అనేది ప్రతి ఒక్కరు తెలుసుకోవాలి. మెలటోనిన్ , సెరటోనిన్ అనే హార్మోన్లు మంచి నిద్రకు కారణంగా భావిస్తారు. విటమిన్ బి6 ఈ రెండు హార్మోన్ల స్రావాన్ని పెంచుతుంది. విటమిన్ బి 6 ఉన్న ఆహారాన్ని ప్రతిరోజు ఆహారంలో చేర్చుకుంటే మంచి నిద్ర వస్తుంది. విటమిన్ బి6 లోపం వల్ల శరీరంలో కారణమైన మెలటోనిన్, సెరోటోనిన్ హార్మోన్ల స్రావం తగ్గుతుంది. దీనివల్ల మనిషి రాత్రిపూట సరిగా నిద్ర పోలేరు.

## వేసవిలో బయటకు వెళ్తున్నారా..!




మనగళం : ప్రస్తుతం ఎండలు మండిపోతున్నాయి. ఉదయం ఏడు గంటల నుంచి సూర్యుడు ఎండ వేడితో అల్లాడిస్తున్నాడు. ఇక 10,11 మధ్యాహ్నం సమయంలో అయితే ప్రజలు ఇంటి నుంచి బయటకు రావాలి అంటేనే భయపడుతున్నారు.విపరీతమైన ఎండల కారణంగా ప్రజలు బయటికి రాలేకపోతున్నారు. భగ్గుమంటున్న భానుడి ఉగ్రరూపానికి ప్రజలు అల్లాడిపోతున్నారు. ఇలాంటి వేసవికాలంలో అనవసరంగా బయటకు వెళ్లకపోవడమే మంచిది. కానీ కొన్ని కొన్ని సార్లు ఎమర్జెన్సీ పనులు పడినప్పుడు బయటకు వెళ్లక తప్పదు. అయితే అలాంటప్పుడు ఎండకు వెళ్ళేటప్పుడు కొన్ని రకాల జాగ్రత్తలు తీసుకోమని చెబుతున్నారు వైద్యులు. ఒక వేళ వెళ్లాలనుకున్నప్పుడు ప్రొద్దున్న పదకొండు లోపల, సాయంత్రం నాలుగు తరువాత బయట పనులు చక్కబెట్టుకోవాలి. అలాగే ఈ కాలంలో వేసుకునే దుస్తుల నుండి తీసుకునే ఆహారం వరకు కొన్ని జాగ్రత్తలను పాటిస్తే భగభగమండే సూర్యుని కిరణాల తాకిడి నుంచి శరీరాన్ని కాపాడుకోగలమం. ముఖ్యంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు ఇంట్లోనే ఉండాలని సూచిస్తున్నారు. ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో ఎండలో బయటకు వెళ్లవలసి వస్తే ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. వెళ్లే ముందు ఒక గ్లాసు నిమ్మరసం, చల్లని పాలు, మజ్జిగ తీసుకోవాలంటున్నారు.

## అనారోగ్య సమస్యలున్నవారు అరటి పండు తింటే..?



మనగళం: అరటిపండు వల్ల ఎన్నో రకాల ప్రయోజనాలు ఉన్నాయి అన్న విషయం మనందరికి తెలిసిందే. అరటిపండు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఈ పండుని చిన్న పిల్లల నుంచి పెద్దవారి వరకు ప్రతి ఒక్కరు ఇష్టపడి తింటూ ఉంటారు. కాగా మనకు ఈ అరటిపండ్లు మనకు ఏడాది పొడవునా లభిస్తూ ఉంటాయి. అయితే అరటిపండు ఆరోగ్యానికి మంచిదే కానీ , కొన్ని రకాల అనారోగ్య సమస్యలు ఉన్నవారు ఈ పండ్లు తీసుకోవడం అసలు మంచిది. మరి ఎటువంటి సమస్యలు ఉన్నవారు అరటిపండు తినకూడదు? ఒకవేళ తింటే ఏం జరుగుతుందో ఇప్పుడు మనం తెలుసుకుందాం.. అరటిపండ్లలో అధిక మొత్తంలో సహజ చక్కెర ఉంటుంది. కాబట్టి అరటి పండ్లను డయాబెటిస్ ఉన్నవారు ఎక్కువగా తినకూడదు. అంతేకాదు జీర్ణ సంబంధమైన వ్యాధులతో బాధపడే వారు కూడా అరటి పండ్లను తినకూడదు. డయాబెటిస్ తో బాధపడుతున్న వారు వారికి రక్తంలో చక్కెర మరింత పెరిగి తీవ్ర అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. మధుమేహ వ్యాధిగ్రస్తులు అరటి పండ్లను తినకుండా ఉంటేనే మంచిది. అలాగే శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న వారు అరటి పండ్లను తినకూడదు. అంతేకాదు విపరీతమైన జలుబు, దగ్గుతో బాధపడుతున్న వారు కూడా అరటి పండ్లను తినకూడదు. అలర్జీ వంటి సమస్యలు ఉన్నవారు కూడా అరటి పండ్లకు దూరంగా ఉండాలి. మైగ్రేన్ తో బాధపడే వారు అరటి పండ్లను తినకుండా ఉంటేనే మంచిది. మైగ్రేన్ తో బాధపడేవారు అరటిపండ్లను తినకుండా ఉండాలి. ఇది మైగ్రేన్ సమస్యను మరింత పెంచుతుంది. ఇక అజీర్ణ సమస్యలు ఉన్నవారు అరటిపండ్లను చాలా తక్కువగా తినాలి. ఎక్కువ అరటి పండ్లు తింటే జీర్ణ సమస్యలు మరింత పెరుగుతాయి. మలబద్ధకం సమస్య ఉన్నవారు కూడా అరటిపండును తినకుండా ఉండాలి. ఇక లూజ్ మోషన్స్ అవుతున్న వారు విరోచనాలను తగ్గించడానికి అరటి పండ్లను తింటారు కానీ, ఎక్కువ అరటి పండ్లు వీరు కూడా తినడం మంచిది కాదు.

## ఫ్రిజ్‌లో పెట్టిన పుచ్చకాయను తింటున్నారా..!



మనగళం :వేసవి కాలం మొదలెంంది. ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 10 గంటల నుంచి సూర్యుడు తన విశ్వరూపం చూపిస్తున్నాడు. ఇంట్లో నుంచి బయటకు వెళ్లగానే విపరీతంగా చెమటలు పడుతున్నాయి.మన శరీరం నుండి పోషకాలను కోల్పోవడం వల్ల ఇది సంభవిస్తుంది. కానీ దీన్ని బ్యాలెన్స్ చేయడానికి చాలా మంది పుచ్చకాయలను ఎక్కువగా తింటారు. పుచ్చకాయలో లెఏకోపీన్, యాంటీఆక్సిడెంట్ ఎలిమెంట్స్, విటమిన్ ఎ, విటమిన్ సి, పొటాషియం, అమినో యాసిడ్స్ పుష్కలంగా ఉన్నాయి. బరువు తగ్గాలనుకునే వారికి కూడా ఇది బాగా ఉపయోగపడుతుంది. ఇందులో చాలా తక్కువ కేలరీలు ఉంటాయి కాబట్టి, ఈ పండు తినడం వల్ల మీ పొట్ట నిండుగా ఉన్న అనుభూతినిస్తుంది. పుచ్చకాయ వేసవిలో ఎండ వేడిమి నుండి మన శరీరాన్ని కాపాడుతుంది. దీనిలో 92% నీరు కూడా ఉంటుంది. ఇది రక్తపోటును నియంత్రిస్తుంది. పుచ్చకాయలో కేలరీలు తక్కువగా ఉంటాయి. ఫలితంగా, పుచ్చకాయ శరీరంలో చక్కెర పరిమాణాన్ని నియంత్రిస్తుంది. డైటింగ్ చేసేవారికి కూడా పుచ్చకాయ చాలా మంచిది. కానీ కొందరు మాత్రం పుచ్చకాయను రిఫ్రిజిరేటర్‌లో ఉంచి తింటారు. అయితే, ఇలా చేయడం వల్ల పోషక విలువలు తగ్గుతాయి. సాధారణంగా కొంతమంది మార్కెట్ నుంచి తీసుకురాగానే పండ్లను ఫ్రిజ్ లో నిల్వ చేసి రెండు, మూడు రోజుల తర్వాత తింటుంటారు. మరి కొందరు పుచ్చకాయను సగం కోసి ఫ్రిజ్ లో పెడుతుంటారు. కానీ ఇది మంచిది కాదని తాజా పరిశోధనలు చెబుతున్నాయి. అయితే, కట్ చేసిన పుచ్చకాయను రిఫ్రిజిరేటర్‌లో నిల్వ చేస్తే ఫుడ్ పాయిజన్ అయ్యే ప్రమాదం ఉంది. ఇది ఆరోగ్యానికి చాలా హానికరమని నిపుణులు చెబుతున్నారు.

# ప్రకృతితో స్నేహం చేసే రోజు.. ప్రపంచ హిమదినోత్సవం

మనగళం : ప్రకృతి తన అందాన్ని అనేక రూపాల్లో మనకు చూపిస్తుంది. వాటిలో అత్యంత ఆకర్షణీయమైనది మంచు. తెల్లని హిమపాతం భూమిని కప్పేసినప్పుడు, అది ఒక చిత్రపటంలా కనిపిస్తుంది. ఆ మంచుతో మనిషి అనుబంధాన్ని పెంపొందించడానికే ప్రపంచ హిమదినోత్సవం నిర్వహిస్తారు. సాధారణంగా ప్రతి సంవత్సరం జనవరి మూడో ఆదివారానికి సమీపంలో, కొన్ని దేశాల్లో ఈ దినోత్సవాన్ని ప్రత్యేకంగా జరుపుకుంటారు. పిల్లలు, యువతలో ప్రకృతి పట్ల ప్రేమను పెంచడం, మంచు క్రీడలపై ఆసక్తి కలిగించడం దీని ప్రధాన ఉద్దేశ్యం.

ప్రపంచ హిమదినోత్సవం ఒక పండుగ మాత్రమే కాదు. ఇది ప్రకృతి సౌందర్యాన్ని ప్రత్యక్షంగా అనుభవించే అవకాశం. మంచుతో కప్పబడిన పర్వతాలు, లోయలు, అడవులు మనసుకు అపూర్వమైన శాంతిని ఇస్తాయి. నగర జీవన ఒత్తిడి నుంచి కొద్దిసేపైనా బయటకు వచ్చి, స్వచ్ఛమైన గాలిలో ప్రకృతితో మమేకం కావాలన్న ఆలోచనను ఈ రోజు బలంగా గుర్తు చేస్తుంది. మంచు కురిసే ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ఇది వారి దైనందిన జీవితంలో భాగమే అయినా, ప్రపంచంలోని మిగతా ప్రాంతాల వారికి అది ఒక అద్భుత అనుభూతి.

ఈ దినోత్సవంలో మంచు క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుంది. స్కీయింగ్, స్నోబోర్డింగ్, స్లెడ్జింగ్ వంటి క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడమే కాకుండా, ధైర్యం, క్రమశిక్షణను నేర్పుతాయి. పిల్లలు చిన్న వయసు నుంచే ప్రకృతితో కలిసి ఆడటం ద్వారా, ప్రకృతిని గౌరవించే భావనను అలవర్చుకుంటారు. మొబైల్ తెరలకే పరిమితమైన నేటి తరం బయట ప్రపంచాన్ని అనుభవించాలన్న సందేశాన్ని ప్రపంచ హిమదినోత్సవం స్పష్టంగా ఇస్తుంది.

ప్రపంచ హిమదినోత్సవం వెనుక ఉన్న మరో ముఖ్యమైన ఉద్దేశ్యం పర్యావరణ అవగాహన. వాతావరణ మార్పుల ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా హిమనదాలు వేగంగా కరుగుతున్న వాస్తవాన్ని ఈ రోజు మనకు గుర్తు చేస్తుంది. మంచు తగ్గితే కేవలం ప్రకృతి అందమే కాదు, మన జీవన విధానమే ప్రమాదంలో పడుతుంది. నదుల ఉద్భవం, సాగునీటి వనరులు, తాగునీటి అవసరాలు అన్నీ హిమనదాలపై ఆధారపడి ఉన్నాయి. హిమపాతం తగ్గడం భవిష్యత్తులో నీటి కొరత, ప్రకృతి విపత్తులకు దారితీసే ప్రమాదం ఉంది.మంచు అనేది అందం మాత్రమే కాదు, అనేక దేశాలకు అది జీవనాధారం. విద్యుత్ ఉత్పత్తి, వ్యవసాయం, పర్యాటకం వంటి రంగాలు హిమంపై ఆధారపడి ఉన్నాయి. ఈ నేపథ్యంలో హిమనదాల పరిరక్షణ అనేది ఒక ప్రాంత సమస్య కాదు, ప్రపంచ సమస్య. ప్రపంచ హిమదినోత్సవం ద్వారా ఈ విషయాలపై ప్రజల్లో అవగాహన పెంచాలని నిర్వాహకులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రకృతిని నిర్లక్ష్యం చేస్తే, దాని ప్రభావం తరతరాలపై పడుతుందన్న వాస్తవాన్ని ఈ రోజు స్పష్టంగా చెబుతుంది.

ప్రపంచ హిమదినోత్సవం మనందరికీ ఒక ఆలోచనను అందిస్తుంది. ప్రకృతిని కేవలం ఆస్వాదించే వస్తువుగా కాకుండా, కాపాడాల్సిన బాధ్యతగా చూడాలని సూచిస్తుంది. మంచు క్రీడల ఉల్లాసం వెనుక దాగి ఉన్న పర్యావరణ సందేశాన్ని అర్థం చేసుకుంటేనే ఈ దినోత్సవానికి నిజమైన అర్థం ఉంటుంది. ప్రకృతితో స్నేహం చేస్తూ, భవిష్యత్తు తరాలకు భద్రమైన ప్రపంచాన్ని అందించాలన్న సంకల్పానికి ప్రపంచ హిమదినోత్సవం ఒక ప్రేరణగా నిలుస్తుంది.

# వెంకటేశ్ సినిమాలో నారా రోహిత్ ఎంట్రీ.. యాంటీ కాప్ పాత్రలో సెన్సేషన్..!!

హైదరాబాద్, జనవరి 20,మనగళం : వెంకటేశ్, త్రివిక్రమ్ కాంబినేషన్ లో తెరకెక్కుతున్న ఆదర్శ కుటుంబం సినిమా ప్రకటన వెలువడినప్పటి నుంచే ప్రేక్షకుల్లో భారీ ఆసక్తి నెలకొంది. ఈ సినిమా చుట్టూ ఇప్పటికే హైప్ కొనసాగుతుండగా తాజాగా మరో ఆసక్తికర వార్త సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ చిత్రంలో నారా రోహిత్ కీలక పాత్రలో కనిపించనున్నాడన్న టాక్ హల్‌చల్ చేస్తోంది. ఆయన యాంటీ కాప్ పాత్రలో నటిస్తున్నారని సమాచారం. ఇన్‌సైడ్ టాక్ ప్రకారం నారా రోహిత్ ఇప్పటికే షూటింగ్‌లో పాల్గొన్నాడని తెలుస్తోంది. తన పాత్రకు సంబంధించిన సన్నివేశాల చిత్రీకరణ కూడా ప్రారంభమైందట. వెంకటేశ్‌కు జోడీగా ఈ సినిమాలో శ్రీనిధి శెట్టి నటిస్తోంది. ముందుగా ఈ చిత్రాన్ని సమ్మర్ కానుకగా విడుదల చేయాలని భావించినప్పటికీ పలు కారణాలతో విడుదల వాయిదా పడింది. త్వరలోనే కొత్త విడుదల తేదీని ప్రకటించనున్నట్లు చిత్రబృందం సూచిస్తోంది. ఈ సినిమాకు హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం అందిస్తున్నాడు. షూటింగ్ వేగంగా సాగుతుండగా తదుపరి ప్రాజెక్టుపై కూడా వెంకటేశ్ దృష్టి పెట్టినట్లు సమాచారం. నారా రోహిత్ ఎంట్రీతో ఈ సినిమాపై అంచనాలు మరింత పెరిగాయని అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.






# భన్సాలీ మ్యాజిక్‌లో ప్రేమ జంట..



హైదరాబాద్ జనవరి 20, 2026 మనగళం :బాలీవుడ్‌లో యువ నటుడు సిద్ధాంత్ చతుర్వేది, స్టార్ హీరోయిన్ మృణాల్ ఠాకూర్ జంటగా నటిస్తున్న తాజా ప్రేమకథ చిత్రం 'దో దీవానే షెహర్ మే'పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. సంజయ్ లీలా భన్సాలీ నిర్మాణంలో రూపొందుతున్న ఈ సినిమాకు రవి ఉద్యవార్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన టీజర్ విడుదల కావడంతో సినీ వర్గాల్లో ఆసక్తి మరింత పెరిగింది.టీజర్ చూస్తే ముంబై నగరం నేపథ్యంగా సాగే ఆధునిక ప్రేమకథగా సినిమా రూపుదిద్దుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రేమ, భావోద్వేగాలు, యువత ఆలోచనలు కథలో ప్రధానంగా కనిపిస్తున్నాయి. సిద్ధాంత్, మృణాల్ మధ్య కెమిస్ట్రీ ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. విజువల్స్‌లో నగర జీవన శైలి, సంగీతం మేళవించి రొమాంటిక్ వాతావరణాన్ని దర్శకుడు చక్కగా ఆవిష్కరించారు.ఈ చిత్రాన్ని సంజయ్ లీలా భన్సాలీతో పాటు ప్రేరణ సింగ్, ఉమేష్ కుమార్ బన్సాల్, భరత్ కుమార్‌లు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సినిమాలో అరుణ్, జాయ్ సేన్ గుప్తా వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 26న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. టీజర్ విడుదలతోనే సినిమాపై హైప్ పెరిగి, ప్రేమకథ అభిమానుల్లో ఆసక్తి మరింత బలపడింది.

## ప్రభాస్ సలార్ 2 టీజర్ వచ్చేస్తుంది..



హైదరాబాద్,20-01-2026, మనగళం :కేజీఎఫ్ ఫేం దర్శకుడు ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ సీక్వెల్ చిత్రం సలార్ 2పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. గ్లోబల్ స్టార్ ప్రభాస్ నటిస్తున్న ఈ చిత్రం కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా నెట్టింట వైరల్ అవుతున్న సమాచారం ప్రకారం సలార్ 2 టీజర్ జనవరి 25న విడుదలయ్యే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అధికారిక ప్రకటన రాకపోయినా ఈ వార్త అభిమానుల్లో ఫుల్ జోష్ నింపుతోంది. హోంబలే ఫిలిమ్స్ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని విజయ్ కిరంగదూర్ నిర్మిస్తున్నారు. సలార్ మొదటి భాగం సూపర్ హిట్ కావడంతో రెండో భాగంపై అంచనాలు మరింత పెరిగాయి. ఈ చిత్రంలో ప్రభాస్‌తో పాటు శృతిహాసన్ కీలక పాత్రలో నటిస్తుండగా శ్రియా రెడ్డి, టిన్ను ఆనంద్ తదితరులు ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. మలయాళ నటుడు షైన్ టామ్ చాకో కూడా ఓ కీలక పాత్రలో నటిస్తున్నాడనే వార్తలు వినిపిస్తున్నాయి. అక్టోబర్‌లో ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా సలార్ 2 షూటింగ్ ప్రారంభమైందన్న ప్రచారం కూడా జరిగింది.

# రహస్య పెళ్లి పుకార్లకు ఫుల్ స్టాప్..



హైదరాబాద్ ,20 జనవరి 2026 , మనగళం : మాస్ మహారాజా రవితేజ నటించిన తాజా చిత్రం భర్త మహాశయులకు విజ్ఞప్తి థియేటర్లలో మంచి స్పందనతో కొనసాగుతున్న వేళ, హీరోయిన్ డింపుల్ హయతి వ్యక్తిగత జీవితంపై సోషల్ మీడియాలో పుకార్లు చక్కర్లు కొడుతున్నాయి. డేవిడ్ అనే వ్యక్తిని ఆమె రహస్యంగా వివాహం చేసుకుందని, ఇద్దరూ కలిసి జీవిస్తున్నారంటూ ప్రచారం జరగడంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఈ వార్తలపై డింపుల్ స్వయంగా స్పందించి స్పష్టత ఇచ్చింది. సోషల్ మీడియాలో ఓ అభిమాని అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ, తనకు ఇప్పటివరకు పెళ్లే కాలేదని వెల్లడించింది. తన వివాహంపై వస్తున్న వార్తలన్నీ పూర్తిగా అవాస్తవమని, వాటిలో ఎలాంటి నిజం లేదని తేల్చి చెప్పింది. ఇలాంటి పుకార్లు సృష్టించవద్దని ఆమె కోరింది. ఇదే సమయంలో సినిమాకు వస్తున్న మంచి స్పందనను ఎంజాయ్ చేస్తూ, ప్రేక్షకుల ప్రేమే తనకు పెద్ద బలం అని డింపుల్ తెలిపింది. రహస్య వివాహం వార్తలకు చెక్ పెట్టిన ఈ స్పందన ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది.

## దారుణంగా జడేజా వైఫల్యం.. మారకపోతే స్థానం



హైదరాబాద్ 20 జనవరి 2026,మనగళం :టీమిండియా సీనియర్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా వన్డే ఫార్మాట్‌లో ఆశించిన స్థాయిలో రాణించ లేకపోవడం ఇప్పుడు పెద్ద చర్చగా మారింది. తాజాగా న్యూజిలాండ్ తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో ఒక్క వికెట్ కూడా తీయలేక పోవడంతో జడేజా ప్రదర్శనపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో అతని మాజీ సహచరుడు రవిచంద్రన్ అశ్విన్ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. జడేజాకు తనదైన బలాలు ఉన్నప్పటికీ అదే పాత విధానంలో కొనసాగడం వల్లే ఇబ్బందులు ఎదురవుతున్నాయని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. బౌలింగ్‌లో కొత్త ప్రయోగాలు చేయాలని ఎన్నిసార్లు సూచించినా జడేజా వినడం లేదని వెల్లడించాడు. బిషన్ సింగ్ బేడీ, మణీందర్ సింగ్, మిచెల్ శాంట్నర్ తరహాలో కొత్త పద్ధతులు ప్రయత్నించాలని చెప్పినా అతడు తన సేఫ్ జోన్ నుంచి బయటకు రావడం లేదని పేర్కొన్నాడు.కొత్తగా ప్రయత్నిస్తే విఫలం అవుతానన్న భయం జడేజాలో ఎక్కువగా ఉందని అశ్విన్ తెలిపారు. అయితే మార్పులు చేయకపోతే జట్టులో స్థానం మరింత ప్రమాదంలో పడుతుందన్న విషయాన్ని గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయంలో విరాట్ కోహ్లీని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఫామ్ కోల్పోయిన సమయంలో కోహ్లీ తన ఆటతీరును మార్చుకుని, ఒత్తిడి లేకుండా ఆడుతూ మళ్లీ పరుగుల వర్షం కురిపిస్తున్నాడని గుర్తు చేశారు. జడేజా కూడా సానుకూల దృక్పథంతో ఆలోచించి కొత్త ప్రయోగాలకు సిద్ధమైతేనే వన్డేల్లో తన స్థానం నిలబెట్టుకోగలడని అశ్విన్ స్పష్టం చేశారు. లేదంటే భవిష్యత్తులో జట్టులో అవకాశాలు తగ్గే ప్రమాదం ఉందని క్రికెట్ వర్గాలు చర్చిస్తున్నాయి.

## సిర్ ముందు హాజరైన క్రికెటర్ మహమ్మద్ షమీ.. దరఖాస్తులో లోపాలపై వివరణ

కోల్కతా 20 జనవరి 2026 , మన గళం: భారత క్రికెటర్ మహమ్మద్ షమీ ఈ రోజు సిర్ అధికారుల ముందు హాజరయ్యారు. పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం కొనసాగుతున్న నేపథ్యంలో ఆయన నింపిన ఎన్యుమరేషన్ దరఖాస్తులో కొన్ని ఖాళీలు ఉన్నట్లు ఎన్నికల అధికారులు గుర్తించారు. దీంతో షమీకి నోటీసులు జారీ చేయగా, ఆ ఆదేశాల మేరకు దక్షిణ కోల్కతాలోని బిక్రంఘర్ ప్రాంతంలోని ఒక పాఠశాలకు వెళ్లి అధికారుల ముందు హాజరయ్యారు.ఉత్తర ప్రదేశ్‌కు చెందిన షమీ కొన్నేళ్లుగా కోల్కతాలో నివసిస్తున్నారు. క్రికెట్ కెరీర్ కారణంగా చిరునామా మార్పు చేసుకున్న ఆయన కోల్కతా మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వార్డు 93లో నివాసం ఉంటున్నారు. ఇది రాష్బిహారీ అసెంబ్లీ నియోజకవర్గంలోకి వస్తుంది. కోచ్ సూచన మేరకు యువ వయసులోనే బెంగాల్‌కు వెళ్లిన షమీ, బెంగాల్ అండర్ 22 జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. అనంతరం బెంగాల్ జట్టు తరపున విజయ్ హజారే ట్రోఫీలో కూడా పాల్గొన్నారు. ఇంతకుముందు జరిగిన హియరింగ్‌కు షమీ హాజరుకాకపోవడంతో అధికారులు మరోసారి నోటీసులు జారీ చేశారు.



తాజాగా ఆయన ప్రత్యక్షంగా హాజరై వివరాలు సమర్పించారు. అధికారులు దరఖాస్తులోని లోపాలను సరిచేసుకునే సూచనలు ఇచ్చినట్లు సమాచారం.

## టీట్వెంటీ ప్రపంచకప్‌పై బంగ్లాదేశ్‌కు తుది హెచ్చరిక.. నిర్ణయానికి డెడ్‌లైన్..!

ఢిల్లీ ,20 జనవరి , మన గళం: టీట్వెంటీ ప్రపంచకప్ 2026లో పాల్గొనే అంశంపై బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు తుది నిర్ణయం తీసుకోవాలని అంతర్జాతీయ క్రికెట్ మండలి స్పష్టంగా ఆదేశించింది. ఈ మేరకు 21 లోపు తమ వైఖరిని ప్రకటించాలని గడువు విధించింది. ఇటీవల భారత్‌బంగ్లాదేశ్ మధ్య నెలకొన్న దౌత్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఆటగాళ్ల భద్రతపై తమకు ఆందోళనలు ఉన్నాయని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ఇప్పటికే తెలియజేసింది.భద్రతా కారణాలతో చేసిన అభ్యర్థనను అంతర్జాతీయ క్రికెట్ మండలి పరిగణనలోకి తీసుకోలేదన్న సమాచారం వెలుగులోకి వచ్చింది. దీంతో బంగ్లాదేశ్ బోర్డుకు తుది నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పరిణామాలు అంతర్జాతీయ క్రికెట్ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

ఇదే సమయంలో టోర్నీ నుంచి పాకిస్థాన్ కూడా తప్పుకునే ఆలోచనలో ఉందన్న వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. అయితే పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఈ ప్రచారాన్ని ఖండించింది. ప్రపంచకప్ నుంచి తప్పుకునే అంశంపై ఎలాంటి అధికారిక చర్చ జరగలేదని స్పష్టం చేసింది. ఈ పరిస్థితుల్లో బంగ్లాదేశ్ తీసుకునే తుది నిర్ణయం ఇతర జట్లపై కూడా ప్రభావం చూపే అవకాశముండటంతో క్రికెట్ అభిమానులు




ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. రేపటిలోపు వెలువడే నిర్ణయం టీట్వెంటీ ప్రపంచకప్ భవితవ్యానికి కీలకంగా మారనుంది.

Printed,edited,published and owned by Nagaruru Raghavendra, Printed At : Global Printers, D.No 10 MIE Industrial Estate, Kallur, Kurnool. AP.
Published From H.NO.45/139, Narasimha Reddy Nagar, Kurnool-518004.A.P. Mobile Number : 9160686078. RNI NO. AP TEL/2007/74310.